సుమతీ శతకము

13321

సుమతీ శతకము

టీకాతాత్పర్య సహితము

ఇది,

పండితులచేఁ బరిష్కరింపఁబడి

రాజమండ్రి వాస్తవ్యులును

బుక్కుసెల్లర్సు నగు

కర్రా అచ్చయ్యగారిచేఁ

బ్రకటింపఁబడియె.

కాకినాడ:

స్కేప్ అండ్ కో ముద్రాక్షరశాల ముద్రితము.

1913.

కాపీరైట్ రిజిష్టరుడు.] [వెల 0-2-0.

హెచ్చరిక.

సుశీలులారా !

మనయాంధ్రదేశమున కంతకును శతకములుచేయు నుపకారము చదువరులకే యనుభవము. అందు సుమతీశతకము శతకములన్నిటియందును గడు బ్రఖ్యాతిగాంచి ప్రజలకు విస్తారము మేలొనర్చుచున్నది. ఏలయనగా నిందు మనుష్యునియొక్క సత్ప్రవర్తనము గుఱించియు, నితరులయెడ నడచుకొనవలసిన విధమును గూర్చియు నిర్వివాదములయిన నీతులన్నియుఁ బొందుపఱుపఁబడి, బాలురకును సయితము తెలియునట్టి యుపమానములతో నిండి సులభమగు మృదుమధురభాషతో నొప్పుచుండుటయే కారణము. ఈనీతులన్నియుఁ ననుభవసిద్ధముగ వ్రాయఁబడినవి. కనుక నీప్రకారము ప్రవర్తించువారలు మంచిప్రవర్తనముగలిగి, లోకమునందు జయము నొందుటకు సందియములేదు. కాన నీశతకము నందఱును బఠించి మేలును బొందుదురుగాక !

ఇట్లు,

భాషాభిమాని.

శ్రీరస్తు.

సుమతీశతకము

శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకలజనులు ♦ నౌరాయనగా
ధారాళమైననీతులు
నోరూరఁగ జవులుపుట్ట ♦ నుడివెదసుమతీ॥ 1

టీ॥ సుమతీ=మంచిబుద్ధిగలవాఁడా! శ్రీరామునిదయచేతను=శ్రీరాములవారియనుగ్రహమునవలన, ఆరూఢిగన్=నిశ్చయముగా, సకలజనులు=జనులందఱును, ఔరా=సెబాసని, అనగాన్=పల్కునట్లుగా, ధారాళమైననీతులు=అందఱునిష్టపడునీతులను, నోరూరగన్=నోటియందూటలూరునట్లుగా,(మధురములగుపదార్థములనుజూచినచో నందఱును దినవలెనను నాసచేత నోటియందూటలూరును) చవులు=రుచులు, పుట్టన్=కలుగునట్లు, నుడివెదన్=చెప్పెదను.

తా॥ ఓయోగ్యమయినమనస్సుగలవాఁడా! శ్రీరాములవారియనుగ్రహమువలన జనులందఱును మెచ్చునట్లుగా సమస్తజనుల నాదరణమును బడయు నీతివాక్యములను, నోటియం దూటలూరునట్లుగాఁ జెప్పెదను.

క॥ అక్కఱకురాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు ♦ మోహరమునఁ దా
నెక్కినఁ బాఱని గుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయుఁ ♦ గదరా సుమతీ॥ 2

టీ॥ సుమతీ! అక్కఱకున్=ప్రయోజనమునకు, రానిచుట్టము=రానట్టిబంధువును, మ్రొక్కినన్=నమస్కారములు సేయఁగా, వరము=శుభమును, ఈని=ఇయ్యనట్టి, వేల్పున్=దేవుని, మోహరమునన్=యుద్ధమునందు, తాన్=తాను, ఎక్కినన్=ఎక్కఁగా, పాఱని=(శత్రువులపై పురకు) పరుగిడని, గుఱ్ఱము=గుఱ్ఱమును, గ్రక్కునన్=తక్షణమే, విడువంగవలయుఁగదరా=విడువవలయునుగదా, (తప్పకుండగా విడువవలయును)

తా॥ సమయమువచ్చినప్పు డుపకారము జేయని బంధువును, నమస్కరించినను శుభంబుల నొసఁగని దైవమును, యుద్ధభూమియందు శత్రువులమీదికి పరుగెత్తనిగుఱ్ఱమును వెంటనే విడువవలయును.

క॥ అడిగిన జీతం బియ్యని
మిడిమేలపుదొరనుగొల్చి ♦ మిడుకుటకంటెన్
వడిగల యెద్దులఁగట్టుక
మడిదున్నుక బ్రదుకవచ్చు ♦ మహిలోసుమతీ॥ 3

టీ॥ అడిగినన్=అడిగినప్పటికిని, జీతంబు=జీతమును, ఇయ్యని=ఇయ్యనటువంటి, మిడిమేలపుదొరను=కోపముపమునధికారిని,

కొల్చి=సేవించి, మిడుకుటకంటెన్=కష్టములఁబడుటకంటె, మహిలోన్=భూమిమీఁద, వడి=వేగము, గలయెద్దులన్=కలిగినట్టియెద్దులను, కట్టుక=కట్టుకొని, మడిన్=పొలమును, దున్నుక=దున్నుకొని, బ్రదుకవచ్చున్=జీవనముసేయవచ్చును.

తా॥ అడిగినప్పటికిని సేవకునికి జీతమునియ్యక కోపపడునట్టి యజమానుని సేవించుటకంటె, వ్యవసాయమును జేసికొని జీవనముసేయుట సర్వోత్కృష్టముగానుండును.

క॥ అడియాసకొలువుఁ గొలువకు
గుడిమణియము సేయఁబోకు ♦ కుజనులతోడన్
విడువక కూరిమిసేయకు
మడవినిదోడరయ కొంటి ♦ నరుగకుసుమతీ॥ 4

టీ॥ సుమతీ, అడియాస=లాభములేని, కొలువున్=సేవను, కొలువకు=చేయకుము, గుడిమణియము=దేవాలయమునందలియధికారమును, చేయన్=చేయుటకొఱకు, పోకు=వెళ్ళకుము, కుజనులతోడన్=చెడ్డవారలతోడ, కూరిమి=స్నేహమును, విడువక=ఎల్లప్పుడును, సేయకు=చేయకుము; అడవిని=అడవిప్రదేశమందు, తోడు=సహాయమును, అరయక=చూచుకొనక, ఒంటి=ఒంటరిగా, అరుగకు=వెళ్ళకుము.

తా॥ లాభములేని దేయుద్యోగమును సేవించుటయును దేవాలయములయందు నధికారమును జేయుటయును, జెడ్డవారితో నెల్లప్పుడును మైత్రిసలుపుటయును, నడవిమార్గమున సహాయము లేకుండా పోవుటయును మానవలయును.

క॥ అధరము గదలియుఁ గదలక
మధురములగు భాషలుడిగి ♦ మానవ్రతుఁడై
నధికారరోగపూరిత
బధిరాంధకశవముఁ జూడఁ ♦ బాపము సుమతీ॥ 5

టీ॥ సుమతీ! అధరము=పెదవి, కదలియున్=ఆడియు, కదలక=ఆడకను, మధురములగు=మనోహరములైన (చెవులకునింపైన) భాషలు=మాటలు, ఉడిగి=మాని, మానవ్రతుఁడు; మాన=మాట్లాడకుండుటయె, వ్రతుఁడు=నియమముగాఁగలవాఁడు, ఐ=అగునట్టి, అధికార=అధికారమనెడు, రోగ=వ్యాధిచేత, పూరిత=నిండింపబడిన, (కనుకనే) బధిర=చెవిటివాఁడును, అంధక=గ్రుడ్డివాఁడును, అగు శవమున్=అయిన శవమును, చూడన్=చూచుట, పాపము=దోషము.

తా॥ అధికారముచేతమత్తుఁడైనవాఁడు, ఇతరులతో మాట్లాడడు, ఇతరులు తనతో చెప్పుకొనునదివినడు. వారిని కళ్ళతో చూడనైననుజూడడు. కనుక అట్టివాఁడు బ్రతికియున్నను చచ్చినవానితో సమానుఁడు. కాన యట్టివానినిజూచుట దోషము.

క॥ అప్పుగొని చేయు విభవము
ముప్పునఁ బ్రాయంపుటాలు ♦ మూర్ఖునితపమున్
దప్పరయని నృపు రాజ్యము
దెప్పరమై మీఁదఁగీడు ♦ దెచ్చుర సుమతీ॥ 6

టీ॥ సుమతీ! అప్పుగొని=ఋణమునుజేసి, చేయు=చేయునట్టి,

విభవమును = వేడుకయును, ముప్పునన్ = ముసలితనమునందు, ప్రాయంపు=యౌవననంతురాలయిన, ఆలు=భార్యయును, మూర్ఖునితపమున్=బుద్ధిహీనునియొక్కతపస్సును, తప్పు=నేరమును, అరయని=విచారింపని, నృపు=రాజుయొక్క, రాజ్యమున్=పరిపాలనయును, దెప్పరమై=సహింపశక్యముకానిదై, మీఁదన్=పిమ్మట, కీడు=ఉపద్రవమును, తెచ్చును=కలిగించునుసుమీ.

తా॥ ఋణమునుదెచ్చిచేయు నుత్సవమును, ముసలితనమునందు పడుచుపెండ్లామును, బుద్ధిహీనుఁడుసేయుతపస్సును, తప్పొప్పుల విచారింపనిరాజుయొక్క పాలనమును సహింపశక్యముకానిదై చివరకు నుపద్రవమును దెచ్చును.

క॥ అప్పిచ్చువాఁడు వైద్యుఁడు
నెప్పుడు నెడతెగక పాఱు ♦ నేఱును ద్విజుఁడుం
బొప్పడినయూరనుండుము
జొప్పడకున్నట్టియూరు ♦ సొరకుముసుమతీ॥ 7

టీ॥ సుమతీ! అప్పు=(తగినంతయవసరమువచ్చినప్పుడు) ఋణమును, ఇచ్చువాఁడు=ఇచ్చునట్టిమనుష్యుఁడు, వైద్యుఁడు=మంచివైద్యుఁడును, ఎప్పుడున్=ఎల్లకాలములయందును, ఎడతెగక=ఎండిపోక, పాఱు=ప్రవహించు, ఏఱును=నదియును, ద్విజుఁడున్=బ్రాహ్మణోత్తముఁడును, బొప్పడిన=ఉన్నట్టి, ఈరన్=గ్రామమునందు, ఉండుము=నివసించుము. చొప్పడక=

(పైనజెప్పిననాల్గును) లేక, ఉన్నట్టియూరన్=ఉండెడిగ్రామము ను, చొరకుము=ప్రవేశింపకుము.

తా॥ తగినంతయవసరముఁగలిగిన, నప్పిచ్చువాఁడును, మంచి వైద్యుఁడును, ఏకాలమునందును, ఎండిపోక మంచినీరునిచ్చునదియును, మంచిబ్రాహ్మఁడును, లేనియూరునందు కాపురముసేయుటమిక్కిలి కష్టమనితాత్పర్యము.

క॥ అల్లునిమంచితనంబును
గొల్లనిసాహిత్యవిద్య ♦ కోమలినిజమున్
బొల్లునదంచినబియ్యముఁ
దెల్లనికాకులునులేవు ♦ తెలియుముసుమతీ॥ 8

టీ॥ సుమతీ! అల్లునిమంచితనంబును=అల్లుఁడుమంచివాఁడగుటయు, గొల్లని=గొల్లవాని (శూద్రులనుట) సాహిత్యవిద్య=పాండిత్యమును, కోమలినిజమున్; కోమలి=ఆఁడుదానియొక్క, నిజమున్=సత్యముపలుకుటయును, పొల్లునన్=పొల్లును, దంచినబియ్యము=దంచినచోవచ్చినబియ్యమును, తెల్లనికాకులును=తెలుపువర్ణముగలిగినకాకులును, లేవు = కనుబడవు, తెలియుము=తెలిసికొనుమా.

తా॥ మంచితనముగానుండునల్లుఁడును, పాండిత్యముగలిగిన శూద్రుఁడును, సత్యమునుజెప్పు నాఁడుదియు, పొల్లునుదంచితీసినబియ్యమును, తెల్లఁగానుండుకాకులును ప్రపంచమందులేవు.

క॥ ఆఁకొన్న కూడె యమృతము
తాఁకొందక నిచ్చువాఁడె ♦ దాత ధరిత్రిన్
సోఁకోర్చువాఁడె మనుజుఁడు
తేఁకువగలవాఁడె వంశ ♦ తిలకుఁడు సుమతీ॥ 9

టీ॥ సుమతీ! ఆఁకొన్న కూడె=ఆఁకలి కలిగినప్పుడు తిన్న యన్నమే, అమృతము=అమృతమువంటిది, తాఁకు=అడ్డును, ఒందక=చెందక, ఇచ్చువాఁడె=ఇచ్చినట్టి వాఁడె, దాత=ధర్మాత్ముఁడు, ధరిత్రిన్=భూమి యందు, సోఁకు=కష్టమును, ఓర్చువాఁడె=సహించువాఁడె, మనుజుఁడు=మనుష్యుఁడు, తేఁకువ=ధైర్యముకలవాఁడె, వంశతిలకుఁడు=కులమునకు భూషణమైన వాఁడు.

తా॥ ఆకలికలిగినప్పుడు తిన్నయన్నమే మిక్కిలి రుచిగానుండును. పాత్రాపాత్రతనెఱింగి యడ్డుచెప్పకుండా ధర్మముచేయువాఁడె దాత. కష్టములువచ్చినప్పుడధైర్యపడక యోర్చువాఁడె మనుష్యుఁడు. ధైర్యముగలవాఁడె వంశమునంతకును గీర్తినిచ్చును.

క॥ ఆఁకలి యుడుగని కడుపును
వేఁకటియగు లంజపడుపు ♦ విడువని బ్రతుకున్
బ్రాఁకొన్న నూతియుదకము
మేఁకల పాడియును రోఁత ♦ మేదిని సుమతీ॥ 10

టీ॥ సుమతీ! ఆఁకలి, ఉడుగని=తీరని, కడుపును=తిండియును, వేఁకటి=గర్భముగలది, అగు, లంజ=ఉంపుడుకత్తె యొక్క, పడుపు=జారత్వమును, విడువని=మానని, బ్రతుకున్=జీవనము

ను, ప్రాఁక్కొన్న=మురికిగలిగిన, నూతియుదకము=నూతినీరును, మేఁకలపాడియును, మేదినిన్=భూమియందు, రోఁత=అసహ్యమైనది.

తా॥ ఆఁకలితీఁగనియన్నమును, గర్భముగలలంజెయొక్క జారత్వమును, పాడుపడిననూతినీళ్ళును, మేఁకలపాడియును, రోఁతనుకలిగించును.

క॥ ఇచ్చునదె విద్య రణమునఁ
జొచ్చునదే మగతనంబు ♦ సుకవీశ్వరులున్
మెచ్చునదె నేర్పు వాదుకు
వచ్చునదే కీడుసుమ్ము ♦ వసుధను సుమతీ॥ 11

టీ॥ సుమతీ! వసుధను=భూమియందు, ఇచ్చునదె=ధనమునిచ్చునదె, విద్య=చదువు, రణమునన్=యుద్ధమునందు, చొచ్చునదే=ప్రవేశించునట్టిదే, మగతనంబు=పౌరుషము, సుకవీశ్వరులున్=మంచికవులుగూడ, మెచ్చునదే=సంతోషించునదే, నేర్పు=సామర్థ్యము, వాదుకు=తగవునకు, వచ్చునదే=వచ్చునట్టిదే, కీడుసుమ్ము=అపకారమునుదెచ్చునదిసుమీ.

తా॥ ధనమును గడింపఁజేయునదియేచదువు. పిఱికితనములేక యుద్ధరంగమునందు బ్రవేశించునదే పౌరుషము. గొప్పకవీశ్వరులుమెచ్చునదే నేర్పు. తగవునకువచ్చునట్టిదే కీడు.

క॥ ఇమ్ముఁగఁజదువనినోరును
నమ్మాయనిపిలిచి యన్న ♦ మడుగనినోరున్

దమ్ములఁ బిలువనినోరును
కుమ్మరి మనుద్రివ్వినట్టి ♦ గుంటసుమతీ॥ 12

టీ॥ సుమతీ! ఇమ్ముగన్=బాగుఁగా, చదువనినోరును=చదువలేనినోరును, అమ్మా, అని, పిలిచి, అన్నము=అన్నమును, అడుగని=అడుగనట్టినోరును, తమ్ములన్=తమ్ములను, పిలువని=పిలువనట్టి, నోరును, కుమ్మరి=కుమ్మరివాఁడు, మను=మన్నును, త్రివ్వినట్టిగుంటర=త్రివ్వినట్టిగుంటసుమీ.

తా॥ బాగుఁగాచదువలేని నోరును, అమ్మా! యనిపిలిచి యన్నమడుగనివాని నోరును, తమ్ములతో మాట్లాడనివాని నోరును, కుమ్మరవాఁడు మన్నును త్రివ్వినట్టి గుంటతో సమానము.

క॥ ఉదుముండదె నూఱేండ్లును
బడియుండదె పేర్మిఁబాము ♦ పదినూఱేండ్లన్
మడువునఁ గొక్కెరయుండదె
కదు నిలఁబురుషార్థపరుఁడు ♦ గావలెసుమతీ॥ 13

సుమతీ! ఉదుము; నూఱేండ్లును=నూరుసంవత్సరములును, ఉండదె=బ్రతికియుండదా, పాము, పేర్మిన్=అతిశయముతో, పదినూఱేండ్లన్=వేయేండ్లును, పడియుండదె=బ్రతికియుండదా, మడువునన్=చెఱువునందు, కొక్కెర=కొంగ, ఉండదె=అన్నియేండ్లుఉండదా, కదున్=మిక్కిలి, పురుషార్థపరుఁడు=

ధర్మార్థకామమోక్షములను పురుషార్థములయం దాసక్తి కల వాఁడు, కావలెన్=కావలయును.

తా॥ పాము, కొంగ, ఉడుము మొదలగునవి చిరకాలము బ్రతికియుండును. వానివలెనే మనుష్యుఁడును ధర్మార్థకామ మోక్షములను పురుషార్థములయొక్క చింత లేక యెంతకాల ము బ్రతికియుండినను బ్రయోజనము లేదు. కాన నందఱును పురుషార్థములయం దాసక్తి గలవారై యుండవలయును.

క॥ ఉత్తమగుణములునీచున
కెత్తెఱఁగునఁగలుగనేర్చు ♦ నెయ్యెడలం దా
నెత్తిచ్చికరఁగిపోసిన
నిత్తడిబంగారమగునె ♦ యిలలోసుమతీ॥ 14

టీ॥ సుమతీ ! నీచునకున్=అల్పునకు, ఉత్తమగుణములు= మంచిగుణములు, ఎత్తెఱఁగునన్=ఎవ్విధమున, కలుగనేర్చున్= రాఁగలవు ; ఎయ్యెడలన్=ఎస్థలములందైనను, తాన్=తాను, ఎత్తిచ్చి=సరియైనయెత్తునిచ్చి, కరఁగి=కరఁగించి, పోసినన్=పో సినప్పటికి, ఇత్తడి, బంగారము=బంగారముగా, అగునె=యగు నా-యగదనుట.

తా॥ బంగారముతో సరియైన యెత్తుగలయిత్తడిని గఱఁగిం చినను బంగారమువలె నెప్పుడును కాంతిగానుండునా ? అట్లే నీ చునకెంతకష్టపడినను మంచిగుణములబ్బవు.

క॥ ఉదకము ద్రావెడు హయమును
మదమున నుప్పొంగుచుండు ♦ మత్తేభంబున్
మొదవుకడ నున్న వృషభముఁ
జదువని యా నీచుకడకుఁ ♦ జనకుర సుమతీ. 15

టీ॥ ఉదకము=జలమును, త్రావెడు=త్రాగుచున్నట్టి, హయమును=గుఱ్ఱము వైపునకు, మదమునన్=మత్తుచేత, ఉప్పొంగుచుండు మత్తేభంబున్=ఉద్రేకించియున్న మదపుటేనుఁగు వైపునకును, మొదవుకడన్ ఆవుదగ్గఱను, ఉన్న వృషభమున్=ఉన్నట్టి యెద్దుజోలికిని, చదువని యా నీచుకడకున్=జ్ఞానము లేని యల్పుని దగ్గఱకును, చనకుర=వెళ్ళకుము.

తా॥ నీరు త్రావు గుఱ్ఱము దగ్గఱకును, మత్తెక్కియున్న యేనుఁగు దగ్గఱకును, ఆవుతో నున్న ఎద్దు దగ్గఱకును, జ్ఞానము లేని దుష్టుని దగ్గఱకును వెళ్ళఁగూడదు.

క॥ ఉపకారికి నుపకారము
విపరీతముగాదు సేయ ♦ వివరింపఁగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాఁడు ♦ నేర్పరి సుమతీ॥ 16

టీ॥ సుమతీ! ఉపకారికిన్=మేలు చేయువానికి, ఉపకారము=తిరిగి మేలును, చేయన్=చేయుట, విపరీతము=విరుద్ధము, కాదు=కాఁజాలదు; వివరింపఁగాన్=ఆలోచింపఁగా, అపకారికిన్=కీడు చేసినవానికి, నెపము=మిషను, ఎన్నక=తెలపక, ఉప

కారము=మేలును, చేయువాఁడు=చేయుస్వభావముగలవాఁడు, నేర్పరి=తెలివైనవాఁడు.

తా॥ తనకుపకారము చేసిన మనుజునకుఁ బ్రత్యుపకారము చేయు టొకవింతకాదు, కాని తనకుఁ గీడొనరించినవానికైనను దిరిగి కీడుతలంపక మేలొనరించుటయే విశేషము.

క॥ ఉపమింప మొదలుతియ్యన
కపటంబెడనెడను జెఱకు • కైవడినేపో
నెపములువెదకును గడపటఁ
గపటపు దుర్జాతిపొందు • గదరా సుమతీ॥ 17

టీ॥ సుమతీ! కపటపుదుర్జాతిపొందు=కృత్రిమముగలదుష్టునితోసహవాసము, ఉపమింపఁగ=పోలికచూడఁగా, చెఱకుకైవడినేపో=చెఱకుగడవలె నేసుమీ, (ఏలయనఁగా) మొదలు=మొదటిభాగము, తియ్యన=మధురము, ఎడనెడను=మధ్యమధ్యను, కపటంబు=వంకరయైనది, (కృత్రిమముగలది) కడపటఁ=చివరను, నెపములు=నేరములను (చెఱకుపక్షమున చప్పఁదనము) వెదకునుగదరా=ఎంచునుగద.

తా॥ చెఱకుగడ మొదటిభాగమునందుఁ దియ్యగానుండి, నడుమనడుమను దీపితక్కువయై, చివరకుఁ జప్పబడును. అలాగుననే దుష్టసహవాసము మొదట మిక్కిలి యిష్టముగానుండి, క్రమముగాఁ జెడఁజేయుచు నంత్యమున హానిదెచ్చును.

క॥ ఎప్పటికెయ్యదిప్రస్తుత
మప్పటికా మాటలాడి ♦ యన్యులమనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాఁడు ♦ ధన్యుఁడు సుమతీ॥ 18

టీ॥ సుమతీ ! ఎప్పటికిన్=ఏసమయమునకు, ఎయ్యది=ఏది, ప్రస్తుతము=ఆవశ్యకమైనదో, అప్పటికిన్ = ఆసమయమునకు, ఆమాటలు=తగినమాటలను, ఆడి=చెప్పి, అన్యులమనముల్= ఇతరులమనసులను, నొప్పింపక=బాధింపక, తాన్=తాను, నొవ్వక=బాధపడక, తప్పించుక=తప్పించుకొని, తిరుగువాఁడు= నడచుకొనువాఁడు, ధన్యుఁడు=పుణ్యాత్ముఁడు.

తా॥ ఏసమయమునందెట్లు మాట్లాడవలయునో, ఆసమయమునకుఁ దగునట్లు మాటలుచెప్పి, యొకరికి నొప్పిగలిగింపక తానును బరితాపపడకుండ తిరుగువాఁడే ధన్యుఁడు.

క॥ ఎప్పుడుఁ దప్పులువెదకెడు
నప్పురుషుని గొల్వఁగూడ ♦ దది యెట్లన్నన్
సప్పంబుపడగనీడను
గప్పవసించినవిధంబు ♦ గదరా సుమతీ॥ 19

టీ॥ సుమతీ ! ఎప్పుడున్=ఎల్లప్పుడును, తప్పులు=దోషములను, వెదకెడునప్పురుషుని=వెదకుచుండెడి యామనుష్యుని, గొల్వన్=సేవించుట, కూడదు, అది=అట్లుసేవించుట, ఎట్లు=ఏవిధము, అన్నన్=అనఁగా, సప్పంబుపడగనీడను ; సప్పంబు=పాము

యొక్క, పడగ=పడగయొక్క, నీడను=నీడయందు, కప్ప, వసించినవిధంబు=నివసించినరీతి, కదరా=కాదా? అగును.

తా॥ ఎండతగులకుండ నుండుటకు సర్పముయొక్క పడగ క్రిందకుఁబోవు కప్పకువలెనే యెప్పుడును నేరములనువెదకు పురుషుని సేవించినయెడలఁ దప్పకుండ హాని సంభవించును.

క॥ ఎప్పుడు సంపదగలుగును
నప్పుడ బంధువులువత్తు • రదియెట్లన్నన్
దెప్పలుగఁ జెఱువునిండినఁ
గప్పలుపదివేలు చేరుఁ • గదరా సుమతీ. 20

టీ॥ సుమతీ! ఎప్పుడు=ఏకాలమందు, సంపద=ఐశ్వర్యము, కలుగును=వచ్చునో, అప్పుడ=ఆకాలమునందే, బంధువులు=చుట్టాలు, వత్తురు=వచ్చెదరు; అది=అట్లువచ్చుట, ఎట్లు=ఏవిధము, అన్నన్=అనఁగా, చెఱువు=తటాకము, తెప్పలుగన్=తెప్పలుదేలునంత, నిండినన్=నిండినయెడల, కప్పలు, పదివేలు=అనేకవేలు, చేరున్=ఆచెఱువునకువచ్చిచేరును, కదరా=కదా.

తా॥ చెఱువులోనీరు నిండుగానున్నప్పుడు వేలకొలఁది కప్పలువచ్చును. అట్లే భాగ్యమున్నప్పుడు బంధువులువచ్చుచుందురు. చెఱువులోనీరులేనప్పుడు కప్పలు ఏలాగునరావో, అట్లే సంపత్తులేనివారియింటికి బంధువులు తఱుచుగరారు.

క॥ ఏఱకుమీ కసుగాయలు
దూఱకుమీ బంధుజనుల • దోషముసుమ్మీ

పాఱకుమీ రణమందున
మీఱకుమీ గురువులాజ్ఞ ◆ మేదినిసుమతీ॥ 21

టీ॥ సుమతీ ! కసుగాయలు=లేఁతకాయలను, ఏఱకుమీ=తీయకు, బంధుజనులన్=చుట్టములను, దూఱకుమీ=దూషింపకుము, దోషముసుమీ (దూషించినయెడల) పాపముసుమా; రణమందున్=యుద్ధమునందు, పాఱకుమీ=(వెనుకకు) పాఱిపోకుము, మేదిని=భూమియందు, గురువులాజ్ఞ=గురువులయొక్క యాజ్ఞను, మీఱకుమీ=దాటకుము.

తా॥ పండకుండ లేతకాయలను ఋనకరాదు. బంధువులను నిందింపకూడదు. యుద్ధమం దోడియుఁ బాఱిపోవరాదు. గురువులమాట కెదురుచెప్పవలదు.

క॥ ఒకయూరికి నొకకరణము
నొకతీర్పరియైనఁగాక ◆ నొగిఁదఱుచైనం
గకవికలుగాక యుండునె
సకలంబునుగొట్టువడక ◆ సహజముసుమతీ॥ 22

టీ॥ సుమతీ ! ఒకయూరికిన్=ఒకగ్రామమునకు, ఒకకరణమును=ఒకకరణమును అనఁగా కార్యసాధకుఁడు, ఒకతీర్పరి=ఒక్కన్యాయాధికారియు, ఒగిన్=క్రమముగా, ఐనఁగాక=అయితేనేకాని, తఱుచు=విస్తారము, ఐనన్=అయినట్టయిన, సకలంబును=అంతయును, కొట్టువడక=భంగమునొందక, కకవికలు=చెల్లాచెదరు, కాక=అవకుండ, ఉండునె=ఉండునా? ఉండదు,

తా॥ ఒక్కొక్కగ్రామమున కొక్కొకకరణమును ఒక్కొక న్యాయాధికారియు నేకాని చాలమందియున్నచో నొకరితో నొక రుకలహించి కార్యములను జాడుచేయుదురనిభావము.

క॥ ఒల్లనిసతి నొల్లనిపతి
నొల్లనిచెలికాని విడువ నొల్లనివాఁడే
గొల్లండుకాక ధరలో
గొల్లండును గొల్లఁడౌనె గుణమునసుమతీ॥ 23

టీ॥ సుమతీ! ఒల్లనిసతిన్=ఇష్టముగానుండనిభార్యను, ఒల్లనిపతిన్=ఇష్టముగానుండని యజమానుని, ఒల్లనిచెలికానిన్= ఇష్టపడియుండని స్నేహితుని, విడువన్=విడిచిపెట్టుటకు, ఒల్లనివాఁడే=ఇష్టపడనివాఁడే, గొల్లండు=గొల్లవాఁడు, అనఁగామూర్ఖుఁడు; కాక=అట్లుకాక, ధరలోన్=భూమిమీఁద, గొల్లండును=గొల్లకులమునఁబుట్టినవాఁడును, గుణమునన్ = బుద్ధిచేత, గొల్లఁడు=తెలివితక్కువవాఁడు, ఔనె=అవునా? కాఁజాలఁడు,

తా॥ ప్రేమింపనిభార్యను, ఆదరింపనిప్రభువును, అభిమానముంపనిస్నేహితుని విడిచిపెట్టకయున్నవాఁడు గొల్లవాఁడు (మూర్ఖుఁడు) కాని గొల్లకులమందుఁబుట్టినవాఁడైనను మంచిగుణములుకలవాఁడైనపక్షమున గొల్లఁడు (మూర్ఖుఁడు) కాఁడు. "వెఱ్ఱిగొల్ల" లనియు "గొల్లవానిబుద్ధిమూపుమీఁద" ననియు సామెత గావున "గొల్లవాఁడు" అనఁగా మూర్ఖుఁడనునర్థము వచ్చెను.

క॥ ఓడలబండ్లును వచ్చును
ఓడలునాబండ్లమీఁద ♦ నొప్పుగవచ్చున్
ఓడలుబండ్లునువలెనే
వాడంబడుఁగలిమిలేమి ♦ వసుధనుసుమతీ॥ 24

టీ॥ సుమతీ! ఓడలన్=నావలమీఁద, బండ్లును, వచ్చును; ఓడలును=నావలుకూడ, ఆబండ్లమీఁదన్=ఆబండ్లమీఁదుగా, ఒప్పుగన్=చక్కగా, వచ్చున్=వచ్చును, వసుధను=భూమిలో, కలిమి = సంపదయు, లేమి = దారిద్ర్యమును, ఓడలుబండ్లునువలెనే=ఓడలవలెను బండ్లవలెను, వాడంబడున్=వాడఁబడును.

తా॥ ఓడలమీఁదబండ్లును, బండ్లమీఁద ఓడలునుగూడ రాఁగలవు. ఆవిధముననే సంపదయు దారిద్ర్యమును ఒకదాని వెంబడించి యొకటి వచ్చుచు పోవుచుండును. సంపదయును దారిద్ర్యమును శాశ్వతములుగావని తాత్పర్యము

క॥ కడుబలవంతుండైనను,
బుడమిని బ్రాయంపుటాలిఁ ♦ బుట్టినయింటం
దడ వుండనిచ్చెనేనియుఁ
బడుపఁగ నంగడికిఁ దానె ♦ పంపుటసుమతీ॥ 25

టీ॥ సుమతీ! పుడమిని=లోకమునందు, కడున్=అత్యంతము, బలవంతుఁడు=బలముకలవాఁడు, ఐనను=అయినప్పటికి, ప్రాయంపుటాలిన్=పడుచు పెండ్లమును, పుట్టినయింటన్=పుట్టింటియందు, తడవు=ఎక్కువకాలము, ఉండనిచ్చెనేనియున్ =

ఉండనిచ్చినపక్షమున, పడువఁగన్=సంపాదించుటకొఱకు, అం గడికిన్=రచ్చకు, తానె=స్వయముగానె, పంపుట=చెప్పిపంపుట.

తా॥ మిగులబలశాలియైనను యౌవనములోనున్న తనభార్య ను చిరకాలము పుట్టింటనుండనిచ్చినచో తాను స్వయముగా నాపె పాతివ్రత్యమును భంగపుచ్చినవాఁడే యగును.

క॥ కనకపుసింహాసనమున
శునకముఁ గూర్చుండఁబెట్టి ♦ శుభలగ్నమునం
దొనరఁగఁ బట్టముగట్టిన
వెనుకటిగుణమేలమాను ♦ వినరా సుమతీ॥ 26

టీ॥ సుమతీ ; కనకపుసింహాసనమునన్=బంగారపుగద్దెమీఁ ద, శునకమున్=కుక్కను, కూర్చుండఁబెట్టి=కూర్చుండునట్లుచే సి, శుభలగ్నమునందున్=మంచిముహూర్తమున, ఒనరఁగన్= ఒప్పునట్లు, పట్టమున్=రాజ్యాభిషేకమును, కట్టినన్=చేసినను, వెనుకటిగుణము=మునుపటిబుద్ధిని, ఏల=ఎందుకు, మానున్= మానివేయును, వినరా=వినుము.

తా॥ మంచిలగ్నముచూచి కుక్కకు బట్టాభిషేకముచేసి బంగరుగద్దెనెక్కించినను, మొదటినుండియు సహజముగానున్న దానిబుద్ధి యదిమానదు. అలాగుననే నీచున కెంత గొప్పపద విచ్చినను తన యల్పబుద్ధినిమాత్రము ప్రాణముండఁగా వి డువఁడు.

క॥ కప్పకు నొరగాలైనను
సప్పమునకు రోగమైన ♦ సతి తులువైనన్
ముప్పునదరిద్రుఁడైనను
దప్పదు మఱిదుఃఖమగుట ♦ తథ్యము సుమతీ॥ 27

టీ॥ సుమతీ! కప్పకున్=కప్పకు, ఒరగాలు=కుంటికాలు, ఐనను=అయినను, సప్పమునకున్=పామునకు, రోగము=జబ్బు, ఐనన్, సతి=స్త్రీ, తులువైనన్=తుంటరియైనను దుర్మార్గురాలైనను, ముప్పునన్=ముసలితనమందు, దరిద్రుఁడు=డబ్బులేనివాఁడు, ఐనన్, మఱి=మిక్కిలి, దుఃఖము=కష్టము, అగుట=కలుగుట, తప్పదు=మానదు, తథ్యము=నిజము.

తా॥ కప్పకు కుంటికాలైనను, పాముకు రోగమువచ్చినను, ముసలితనమందు డబ్బులేకపోయినను మిక్కిలి దుఃఖముకలుగును. కప్ప యెగిరిదాటుటచే నడుచును గావున కాలు కుంటియైనచో మిగులబాధకరము. శరీరముతో పాఁకిపోవునదిగాన పామునకు రోగమువచ్చిన మిగుల బాధకరము. ముసలితనమునందు సంపాదించుటకు సామర్థ్యముండదుగాన భోషించుకొనుట మిక్కిలి కష్టమగును.

క॥ కమలములు నీటఁబాసినఁ
గమలాప్తునిరశ్మిసోఁకి ♦ కమలినభంగిన్
దమతమ నెలవులు దప్పినఁ
దమమిత్రులు శత్రులౌట ♦ తథ్యముసుమతీ॥ 28

టీ॥ సుమతీ! కమలములు=తామరపువ్వులు, నీటిన్=జలమును, బాసినన్=వదలినచో, కమలాప్తుని=సూర్యునియొక్క, రశ్మి=వేడిమి, సోఁకి=తగిలి, కమలినభంగిన్=వాడిపోవునవిధముగా, తమతమనెలవులు=తమతమస్థానములను, తప్పినన్=విడిచినయెడల, తమమిత్రులు=తమస్నేహితులు, శత్రులు=విరోధులు, ఔట=అగుట, తథ్యము=నిజము.

తా॥ తామరపువ్వులను నీటిలోనుండి పైకితీసినయెడల, తమస్నేహితుఁడగు సూర్యుని కిరణములుదాకి వాడిపోవునట్లుగా, నెవరుగాని దమస్థానములను దప్పినయెడల తమమిత్రులు శత్రులౌదురు.

క॥ కరణముఁ గరణము నమ్మిన
మరణాంతకమౌనుగాని ♦ మనలేఁడుసుమీ
కరణము తనసరికరణము
మఱి నమ్మక మర్మమీక ♦ మనవలె సుమతీ॥ 29

టీ॥ సుమతీ! కరణము=గ్రామపులెక్కలనువ్రాయువాఁడు, కరణముఁ=మఱియొకకరణమును, నమ్మిన=నమ్మినచో, మరణాంతకము=మరణపర్యంతమైనఆపద, ఔనుగాని=కలుగునుగాని, మనలేఁడుసుమీ=బ్రతుకలేఁడుసుమా, (కావున) కరణము; తనసరికరణము=తనతోసమానమగుకరణమును, నమ్మక, మర్మము=రహస్యమును, ఈక=తెలుపక, మనవలెన్=ప్రవర్తింపవలెను.

తా॥ ఒకకరణము మఱియొకకరణమును నమ్మి తనరహస్యములను మొదలగువానిని దెల్పినచో తప్పక కీడుసంభవించును. ఈయర్థముఁదెలిసి యొకకరణము మఱియొకకరణమును నమ్మరాదు.

క॥ కరణములననుసరింపక
విరసంబునఁ దిన్నతిండి ♦ వికటించుఁజుమీ
యిరుసునఁ గందెనఁ బెట్టక
పరమేశ్వరు బండియైనఁ ♦ బాఱదుసుమతీ॥ 30

టీ॥ సుమతీ! కరణములన్=కరణములను, అనుసరింపక=ఆశ్రయింపక, విరసంబునన్=విరోధముతో, తిన్నతిండి=తిన్న అన్నము, వికటించుఁజుమీ=శరీరమందుఇముడదుసుమా, ఇరుసునన్=బండిచక్రములయొక్క యిరుసునందు, కందెనన్=మసిని, పెట్టక=ఉంచక, పరమేశ్వరుబండియైనన్=పరమేశ్వరునియొక్క బండియైనను, పాఱదు=నడువదు.

తా॥ పరమేశ్వరునిబండియైన నిరుసునందు మసిని బూయని యెడల కదలనట్లే కరణములను సంతోషపెట్టనిచోఁ దానుతిను అన్నముగూడ కడుపులోనిముడదు (అనగాఁ గరణముసు సంతోషపెట్టనియెడల బాధలను గలుగజేయును)

క॥ కరణము సాదై యున్నను
గరిమదగు డిగిసను బాము ♦ గఱవకయున్నన్

ధరఁదేలుమీటకున్నను
గరమరుదుగ లెక్కగొనరు ♦ గదరా సుమతీ॥ 31

టీ॥ సుమతీ! కరణము; సాదు=మంచివాఁడు, ఐ=అయి, ఉన్నను=ఉండినను, కరి=ఏనుఁగు, మదము=మదమును, ఉడిగినను=చాలించినను, పాము, కఱవక=కాటువేయక, ఉన్నన్, ధరన్=భూమియందు, తేలు, మీటక=కుట్టక, ఉన్నన్, కరము=మిక్కిలి, అరుదుగన్=అద్భుతముగా, లెక్కగొనరుగదా=లెక్కచేయరుగదా.

తా॥ కరణము మంచివాఁడయినను, ఏనుగుమదములేనిదైనను; పాము కఱవకయుండినను, తేలుకుట్టకయుండినను, జనులు లక్ష్యపెట్టరు. (ఒకసారియబద్ధమాడినవానిని రెండవసారి నిజము చెప్పినను నమ్మనట్లే అవియన్నియు తమక్రూరస్వభావమును మానినను, క్రూరత్వమును విడినవానినిగా యెంచరనియు తాత్పర్యము)

క॥ కసుగాయఁ గఱచిచూచిన
మసలక దన యొగరుగాక ♦ మధురంబగునా
పసగలుగుయువతులుండఁగఁ
బసిబాలలఁ బొందువాఁడు ♦ పశువురసుమతీ॥ 32

టీ॥ సుమతీ! కసుగాయన్=పచ్చికాయను, కఱచిచూచినన్=కొఱికిచూడఁగా, మసలక=వెంటనే, తనయొగరు=తన స్వాభావికమైనవొగరుగుణము, కాక=లేనిదై, మధురంబు=తి

య్యనిది, అగునా=అవునా (కాదనుట) పస=సారము, గలుగు యువతులు=కలిగినయౌవనవతులు, ఉండగ౯, పసిబాలల౯= (శృంగారమెఱుగని) పసిబాలికలను, పొందువాఁడు=అనుభవించువాఁడు, పశువుర=పశువుతో సమానము.

తా॥ పక్వమగుపండ్లనుమాని పచ్చికాయలను తినువానివలెనే యౌవనవతులగుస్త్రీలనువదలి పసిబాలికలను బొందువాఁడు మూర్ఖుఁడు. (అట్టివానికిని పశువునకును భేదమించుకయు లేదు)

క॥ కవిగానివానివ్రాతయు
సవరసభావములు లేని ♦ నాతులవలపుం
దవిలిచనుపంది నేయని
వివిధాయుధకౌశలంబు ♦ వృథరాసుమతీ॥ 33

టీ॥ సుమతీ! కవి=కవిత్వముచేయువాఁడు, కానివానివ్రాఁతయు=కానియట్టివానియొక్క వాక్యరచనయు, నవరసభావములు=తొమ్మిదియైనరసములును వానిభావములును, లేనినాతులవలపున్=తెలియనట్టిస్త్రీలయొక్కమోహమును, తవిలి=చిక్కువడి, చనుపందిన్=దాటిపోవునట్టి యేదుపందిని, ఏయనివివిధాయుధకౌశలంబు; ఏయని=కొట్టిపడవేయని, వివిధ=అనేకవిధములయిన, ఆయుధ=శస్త్రములయొక్క, కౌశలంబు=నేర్పును, వృథరా=నిష్ప్రయోజనము.

తా॥ కవిత్వముచెప్పలేనివాఁడు గ్రంథమురచించినను, రసములుభావములును తెలియనేరనిస్త్రీలమీఁది మోహమును, స

మయము చిక్కినను పందిపిగొట్టఁజాలనివాని బాణనైపుణ్యము ను వ్యర్థము.

క॥ కాదుసుమీ దుస్సంగతి
పోదుసుమీ కీర్తికాంత ♦ పొందినపిదపన్
వాదుసుమీ యప్పిచ్చుట
లేదుసుమీ సతులవలపు ♦ లేశముసుమతీ॥ 34

టీ॥ సుమతీ! దుస్సంగతి=దుర్జనసహవాసము, కాదుసుమీ=చేయఁగూడదుసుమా, కీర్తికాంత=కీర్తియనెడుస్త్రీ, పొందినపిదపన్=లభించినతరువాత, పోదుసుమీ=విడిచిపోదుసుమా, అప్పు=ఋణమును, ఇచ్చుట, వాదుసుమీ=జగడముసుమా, సతులవలపు=స్త్రీలకుప్రేమ, లేశమున్=కొంచెమైనను, లేదుసుమీ=లేదుసుమా.

తా॥ దుర్జనులతో స్నేహము చేయఁగూడదు, కష్టపడి తెచ్చుకొన్న కీర్తి తొలఁగిపోదు; అప్పిచ్చుట జగడములకు కారణమగును. స్త్రీలకు నిజమైన ప్రేమ కొంచెమైననుండదు.

క॥ కామాతురుఁడు దనిసివిడిచిన
కోమలిఁ బరిపాటుఁడు గవయుఁ ♦ గోరుటయెల్లం
బ్రేమమునఁ జెఱకుపిప్పికిఁ
జీమలు వెసమూఁగినట్లు ♦ సిద్ధము సుమతీ॥ 35

టీ॥ సుమతీ! కామాతురుఁడు=స్త్రీనిమోహించినవాఁడు, తనిసి=

తృప్తినొంది, విడిచినకోమలిన్=విడిచిపెట్టినయాఁడుదానిని, పర విటుఁడు=మఱియొకవిటకాఁడు, కనయున్=పొందుటకు, కోరుట=ఆశించుట, ఎల్లన్=అంతయు, చెఱకుపిప్పికిన్=నమలిరసము మిగ్రింగివేయఁగా నుండిన పిప్పికి, ప్రేమమునన్=ప్రీతితో, చీమలు, వెసన్=తొందరతో, మూఁగిన ట్లు=ముసురుకొనినట్లే, సిద్ధము=నిశ్చయము,

తా॥ స్త్రీనిమనుంముగ నొకఁడు తనివితీరగ భోగించినతర్వాత నా స్త్రీ వేఱొకవిటుఁడు భోగింపనలెననికోరుట చూడఁగా, పిప్పిగానమలినసములేని చెఱకునకు చీమలుపట్టినట్లే రసాభాసముగా నుండకమానదు.

క॥ కారణము లేని నగవును
బేరణమును లేని లేమ ♦ పృథివీస్థలిలోఁ
బూరణము లేని బూరెయు
వీరణములు లేని పెండ్లి ♦ వ్యర్థ రా సుమతీ॥ 36

టీ॥ సుమతీ ! కారణము=హేతువు, లేనినగవును=లేకుండని నవ్వును, పేరణము=నవిక, లేని లేమ=ఉండనియాఁడుది, పృథివీస్థలిలోన్=భూప్రదేశమునందు, పూరణము=బెల్లముతోఁ గలిపిన పప్పుఉండ, లేనిబూరెయు=లేనట్టిబూరియును, వీరణములు=వాద్యములు, లేని పెండ్లి=లేనట్టివివాహము, వ్యర్థరా=వ్యర్థముగదా.

తా॥ తగినంతకారణములేకుండ నవ్వుటయు, ఱవికతొడగని

చిన్నది, బెల్లముపూర్ణముతోఁగలిపి చేయనిబూరియు, వాద్య ములులేకుండచేసిన పెండ్లియును రాణింపవు.

క॥ కులకాంతతోడనెప్పుడుఁ
కలహింపకు వట్టితప్పు ♦ ఘటియింపకుమీ
కలకంఠికంటఁగన్నీ
రొలికినసిరి యింటనుండ ♦ నొల్లదు సుమతీ॥ 37

టీ॥ సుమతీ! కులకాంతతోడన్=భార్యతో, ఎప్పుడున్=ఎప్పుడును, కలహింపకు=విరోధపడకు, వట్టితప్పు=లేనినేరమును, ఘటియింపకుమీ=మోపకుసుమా, కలకంఠికంటన్=ఆఁడుదాని కంటియందు, కన్నీరు=దుఃఖింపఁగా కంటినుండిజారునీరు, ఒలికినన్=జారిపడినట్టయిన, ఇంటన్=ఇంటియందు, సిరి=సంపద, ఉండన్=ఉండుటకై, ఒల్లదు=సమ్మతింపదు.

తా॥ కులకాంతపై వట్టినేరములనుమోపి విరోధపడకూడదు; ఏలయనఁగా స్త్రీలు దుఃఖించినయెడల నాయింట్లో లక్ష్మియుండదు; అనఁగా స్త్రీలుదుఃఖించుటయమంగళము.

క॥ కూరిమిగల దినములలో
నేరములెన్నఁడునుగలుగ ♦ నేరవుమఱియా
కూరిమివిరసంబైనను
నేరములేతోఁచుచుండు ♦ నిక్కము సుమతీ॥ 38

టీ॥ సుమతీ! కూరిమి=ప్రేమ, కలదినములలోన్=ఉన్నరోజులలో, ఎన్నఁడును=ఎప్పటికిని, నేరములు=తప్పులు, కలుగనే

రవు=రాజాలవు; మఱి=కాని, ఆకురిమి=ఆపేక్ష్మ, విరసంబు=సరసముపోయినది, అనఁగా చెడిపోయినది, ఐనను=అయినయెడల, నేరములే=తప్పులే, తోఁచుచుండున్=కనఁబడును, నిక్కము=నిజము.

తా॥ విరోధములేక స్నేహముతోనున్నప్పుడు ఒకరొకరికి తప్పుచేసినను గానరాదు; స్నేహమెప్పుడుండదో యప్పుడు నిజముగా దోషములేకపోయినను, దోషములు కల్పించుకొందురు.

క॥ కొంచెపునరుసంగతిచే
నంచితముగఁగీడువచ్చు నదియెట్లన్నం
గించిత్తు నల్లిగఱచిన
మంచమునకుఁ బెట్లువచ్చు మహిలోసుమతీ॥ 38

టీ॥ సుమతీ! మహిలోన్=భూమియందు, కొంచెపునరుసంగతిచేన్=నీచపురుషుని స్నేహముచేత, అంచితముగన్=ఒప్పునట్లు, కీడు=హాని, వచ్చున్=కలుగును, అది=ఆహానికలుగుట, ఎట్లు=ఏవిధముగా, అన్నన్=అనఁగా, కించిత్తునల్లి=చిన్నదైన నల్లి, కఱచినన్=కుట్టినయెడల, మంచమునకున్=మంచమునకు, పెట్లు=దెబ్బలు, వచ్చున్=కలుగును.

తా॥ నల్లితోఁగూడినమంచమునకు దెబ్బలు తగిలినట్టుగానే నీచునితోటి స్నేహమువలన గొప్పహాని సంభవించును; కనుక నీచులతో సహవాసముచేయఁగూడదు,

క॥ కొక్కోకమెల్లఁ జదివినఁ
చక్కనివాఁడైన రాజచంద్రుండైనన్
మిక్కిలిరొక్కములియ్యక
చిక్కదురా వారకాంత సిద్ధముసుమతీ॥ 40

టీ॥ సుమతీ ! కొక్కోకము=కామశాస్త్రము, ఎల్లన్=పూర్తిగా, చదివినన్=పఠించినను, చక్కనివాఁడు=అందమైనవాఁడు, ఐనన్=అయినను, రాజచంద్రుఁడు=గొప్పరాజు, ఐనన్=అయినను, మిక్కిలిరొక్కములు=ఎక్కువసొమ్ములు, ఇయ్యక=ఇయ్యకుండ, వారకాంత=భోగముది, చిక్కదురా=వశముగాదురా, సిద్ధము=ప్రసిద్ధమే.

తా॥ కామశాస్త్రము జదివి రసికుఁడైనను, సౌందర్యవంతుఁడైనను, గొప్పరాజైనను డబ్బియ్యకుండ భోగంది యెటువంటివారికైనరాదు. భోగముదానికిధనమే ప్రధానమని తాత్పర్యము.

క॥ కొఱగాని కొడుకుపుట్టినఁ
గొఱగామియె కాదు తండ్రి గుణములు చెఱచుం
జెఱకుతుద వెన్నుపుట్టినఁ
జెఱకునఁ దీపెల్లఁ జెఱచు సిద్ధము సుమతీ॥ 41

టీ॥ సుమతీ ! కొఱగానికొడుకు=ప్రయోజకుఁడుకానిపుత్రుఁడు, పుట్టినన్=పుట్టినయెడల, కొఱగామియె=నిష్ప్రయోజనము మాత్రమే, కాదు, తండ్రిగుణములు=తనతండ్రికున్న మంచిగుణములను, చెఱచున్=చెడునట్లుచేయును, చెఱకుతుదన్=చెఱ

కుగడచివరను, వెన్ను=కంకి, పుట్టినన్=పుట్టినమొదల, చెఱకు నన్=చెఱకునందలి, తీపి=తియ్యఁదనమును, ఎల్లన్=అంతయు, చెఱచున్=పోఁగొట్టును, సిద్ధము=నిజము.

తా॥ చెఱకుగట్టుచివర కంకివేసినట్టయిన, కంకియేకాకుండ మిగిలినగడ మాధుర్యముగానుండదు, కట్టు వెన్ను వేయఁగానే రుచిపోవును ; ఆలాగుననే పుత్రుఁడు గుణవంతుఁడుకానిచోఁ దలిదండ్రులకుఁగూడ అపకీర్తి వచ్చును.

క॥ కోమలివిశ్వాసంబును
బాములతోఁ జెలిమి యన్య ♦ భామలవలపున్
వేముల తియ్యఁదనంబును
భూమీశుల నమ్మికలును ♦ బొంకురసుమతీ॥ 42

టీ॥ సుమతీ ; కోమలివిశ్వాసంబును=స్త్రీకినమ్మకముండుటయు, పాములతో=సర్పములతో, చెలిమి=సహవాసమును, అన్యభామలవలపున్=పరస్త్రీలమోహమును, వేములతియ్యఁదనంబును=వేపచెట్లమాధుర్యమును, భూమీశులనమ్మికలును=రాజులవిశ్వాసమును, బొంకుర=కల్లయే.

తా॥ ఆఁడుదానికి విశ్వాసమును, పాములతోడి చనువును, వేఁపచెట్లకు తీపియు, పరస్త్రీలకు ప్రేమయు, రాజులకునమ్మకమును నిజముకావు.

క॥ గడనగలమగనిఁ జూచిన
నడుగడుగున మడుఁగులిడుదు ♦ రతివలు దమలో

గడనుడుగుమగనిఁజూచిన
నడపీనుఁగు వచ్చెనంచు ♦ నగుదురుసుమతీ॥ 43

టీ॥ సుమతీ ! గడన=సంపాదనము, కలమగనిన్=ఉన్నభర్త ను, చూచినన్=చూచినయెడల, అతివలు=స్త్రీలు, అడుగడు గునన్=ప్రతిపదమునకును, మడుఁగులు=బట్టమడతలు, ఇడు దురు=ఉంచుదురు ; గడన=సంపాదనము, ఉడుగుమగనిన్=చే యనిపెనిమిటిని, చూచినన్=చూచినయెడల, నడపీనుఁగు=నడ వగలశవము, వచ్చెన్=వచ్చెను, అనుచున్=అనుకొనుచు, తమ లోన్=తమమనసులందు, నగుదురు=నవ్వుదురు, ఇష్టపడరు.

తా॥ స్త్రీలు సంపాదించుతమభర్తలకు రాఁగానే కాలెక్క డ నడిగిపోవునోయనున ట్లుపచారము చేయుదురు. ధనము గడింపని మగఁడు వచ్చిన లక్ష్యముచేయక యసహ్యపడుదురు.

క॥ చింతింపకు కడచినపని
కింతులు వలతురని నమ్మ ♦ కెంతయు మదిలో
నంతఃపురకాంతలతో
మంతనములు మాను మిదియె ♦ మతముసుమతీ॥

టీ॥ సుమతీ ! కడచినపనికిన్=గతించినకార్యమునకు, చింతిం పకు=విచారపడకుము ; ఇంతులు=స్త్రీలు, వలతురు=ప్రేమిం తురు, అని=అనుకొని, మదిలోన్=మనసునందు, ఎంతయున్= కొంచెమైనను, నమ్మకు=నమ్మియుండవద్దు, అంతఃపురకాంతల తోన్=రాణివాసపుస్త్రీలతో, మంతనములు=రహస్యపుమాట

లు, మానుము=విడువుము, ఇదియే=ఇదే, మతమురా=సమ్మత మోయి.

తా॥ గతించినదానికి వగవకూడదు, స్త్రీలప్రేమ నమ్మవలదు, అంతఃపురస్త్రీలతో రహస్యములాడరాదు; ఇవేవియు మంచివి కావు.

క॥ చీమలు పెట్టినపుట్టలు
పాములకిరవైనయట్లు ♦ పామరుఁడుదగన్
హేమంబుఁగూడఁబెట్టిన
భూమీశులపాలఁజేరు ♦ భువిలో సుమతీ॥ 45

టీ॥ సుమతీ! భువిలోన్=భూమియందు, చీమలు, పెట్టినపుట్టలు=చేర్చిపెట్టినపుట్టలు, పాములకున్=సర్పములకు, ఇరవు=స్థానము, ఐనయట్లు=అయినరీతిగ, పామరుఁడు=మూర్ఖుఁడు, హేమంబున్=బంగారమును, తగన్=ఒప్పునట్లు విస్తారము, కూడఁబెట్టినన్=చేర్చినిలవచేసినపక్షమున, భూమీశులపాలన్=రాజులసన్నిధిని, చేరున్=చేరును.

తా॥ చీమలు పెట్టినపుట్టలు చివరకు పాములకిండ్లగును; అట్లే పామరుఁడు తాననుభవింపక విస్తారము ధనముగడించి కూడఁబెట్టినయెడల, తుదకు ఆధనము రాజులవశమగును. కాఁబట్టి గడించినధనమును మంచియుపయోగమునకుఁ దేవలయును.

క॥ చుట్టములుగానివారలు
చుట్టములము నీకటంచు ♦ సొంపుదలిర్పన్

నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు గలుగఁ • గదరా సుమతీ॥ 46

టీ॥ సుమతీ ! చుట్టములు=బంధువులు, కానివారలు=కానట్టి మనుజులు, గట్టిగన్=విస్తారముగా, ద్రవ్యంబు=ధనము, కలుగన్=కలుగగానే, నీకున్=నీకు, చుట్టములమ=బంధువులము, అటంచున్=అని చెప్పుచు, సొంపు=అందము, తలిర్పన్=ఒప్పఁగా, నెట్టుకొని=పూనుకొని, ఆశ్రయింతురు=సేవింతురు, కదరా=కదా.

తా॥ ధనమును సంపాదింపఁగానే యదివఱలో మొదటినుండియు బంధువులుకానివారైనను మేము తమకు బంధువులమని వరుసలు చెప్పుచు నాశ్రయించెదరు.

క॥ చేతులకుఁ దొడవు దానము
భూతలనాథులకుఁ దొడవు • బొంకమి ధరలో
నీతియ తొడవెవ్వారికి
నాతికి మానంబు తొడవు • నయముగ సుమతీ॥ 47

టీ॥ సుమతీ ! చేతులకున్=చేతులకు, దానము=ఈవి, తొడవు=అలంకారము, ధరలోన్=భూమియందు, భూతలనాథులకున్=రాజులకు, బొంకమి=అబద్ధము చెప్పకుండుట, తొడవు=అలంకారము, ఎవ్వారికిన్=అందఱికి, నీతియ=న్యాయమే, తొడవు=అలంకారము, నాతికిన్=స్త్రీకి, నయముగన్=చక్కఁగా, మానంబు=మంచితనము, తొడవు=అలంకారము.

తా॥ చేతులకు దానముచేయుట, రాజులకు నిజమాడుట, స్త్రీలకు మానము, సమస్తజనులకు న్యాయావలంబనమును ఆభరణములవలె వన్నెదెచ్చునని తాత్పర్యము.

క॥ తడవోర్వక యొడలోర్వక
కడువేగంబడిచిపడినఁ ♦ గార్యంబగునే
తడవోర్చిన నొడలోర్చినఁ
జెడిపోయిన కార్యమెల్లఁ ♦ జేకుఱు సుమతీ॥ 48

టీ॥ సుమతీ! తడవు=ఆలస్యమును, ఓర్వక=సహింపక, ఒడలు=దేహమును, ఓర్వక=సహింపక శరీరపరిశ్రమనుజేయనొల్లక, కడున్=మిక్కిలి, వేగంబు=శీఘ్రముతో, అడిచిపడినన్=ఓపికలేక మండిపడినయెడల, కార్యంబు=పని, అగునే=సాఫల్యమగునా? కాదు. తడవు=ఆలస్యమును, ఓర్చినన్=ఓపికపట్టియాగినను, ఒడలు=దేహమును, ఓర్చినన్=సహించినను ఒళ్ళువంగిపనిచేసినను, చెడిపోయినకార్యము=పాడయినపని, ఎల్లన్=అంతయును, చేకుఱున్=చేకూరును.

తా॥ తొందరపడక శరీరమువంచి పనిచేసికొనినయెడలఁ జెడిపోయినకార్యముకూడ క్రమముగకూడఁదీయవచ్చును. తొందరపడి కష్టపడక తనకేమని గర్వపడినవో సిద్ధముకానున్నకార్యము సహితము చెడిపోవుటతటస్థించును.

క॥ తనకోపమె తనశత్రువు
తనశాంతమె తనకురక్ష ♦ దయచుట్టంబౌ

తనసంతోషమె స్వర్గము
తనదుఃఖమె నరకమండ్రు ♦ తథ్యముసుమతీ॥ 49

టీ॥ సుమతీ ! తనకోపమె=తనయొక్క కోపమె, తనశత్రువు= తనవిరోధి, తనశాంతమె=తనయొక్క శాంతమె, తనకున్=తనకు, రక్ష=రక్షణము, దయ=దయ, చుట్టంబు=బంధువు, ఔన్=అవును, తనసంతోషమె=తనయొక్కసంతోషమే, స్వర్గము=దేవేంద్రపదవి, తనదుఃఖమె=తనవిచారమే, నరకము=యమలోకము, అండ్రు=అనియందురు, తథ్యము=సత్యము.

తా॥ కోపమున్నచోశత్రువక్కఱలేదు, శత్రువుబాధపెట్టునట్లుతనకోపమే తనను బాధించును; తనశాంతమె తనురక్షించును; తనదయయే బంధువువలెనాదరింపఁజేయును; తనసంతోషమె తనకుస్వర్గసుఖముకలుగఁజేయును, తనదుఃఖమే తనకు నరకమందువలె బాధపెట్టును.

క॥ తనయూరి తపసితనమును
దనపుత్త్రునివిద్యపెంపుఁ ♦ దనసతిరూపుం
దనపెరటిచెట్టుమందును
మనసున వర్ణింప రెట్టి ♦ మనుజులుసుమతీ॥ 50

టీ॥ సుమతీ ! తనయూరితపసితనమును=తనగ్రామమునందు తనతపోనిష్ఠయు, తనపుత్త్రునివిద్యపెంపున్=తనకుమారుని విద్యావిశేషమును, తనసతిరూపున్=తనభార్యచక్కఁదనమును, తనపెరటిచెట్టుమందును=తనయింటిదొడ్డిలోఁ బెరిగినచెట్టు యొ

క్క యాపధమును, మనసునన్ = ఇష్టముతో, ఎట్టిమనుజులున్ = ఎటువంటిమానవులును, వర్ణింపరు = పొగడరు.

తా॥ స్వర్గమునందుఁజేయు తపసును, పుత్త్రునివిద్యావిశేషమును, భార్యయొక్క చక్కఁదనమును, తన పెరటిచెట్టుమందును, మనుష్యులెవ్వరైనను పొగడిచెప్పకొనరు.

క॥ తనకలిమి యింద్రభోగము
తనదుఃఖమె సర్వలోక ♦ దారిద్ర్యంబున్
తనచావు జలప్రళయము
తనవలచినయదియె రంభ ♦ తథ్యముసుమతీ॥ 51

టీ॥ సుమతీ! తనకలిమి = తనసంపత్తు, ఇంద్రభోగము = దేవేంద్రసుఖము, తనదుఃఖమె = తనవిచారమే, సర్వలోకదారిద్ర్యంబున్ = సమస్తలోకములయందు నిండియున్న దరిద్రత్వము, తనచావు = తనమరణము, జలప్రళయము = యుగాంతమునందలి జలోపద్రవము, తనవలచినదియె = తాను ప్రేమించినస్త్రీయే, రంభ = రంభయనుపేరుగలదేవవేశ్య, తథ్యము = నిజము.

తా॥ తనసంపదయే తనకు నింద్రభోగముగనుండును, తాను దుఃఖించుటయే సకలలోకములకు దారిద్ర్యముపట్టి నట్లూహించును, తనమరణమే ప్రళయకాలమందలి జలమయమైన యుపద్రవముగాఁదలఁచును, తానుమోహించిన యువతియే రంభయనుకొనును. ఇట్లు తన సుఖదుఃఖములను సర్వలోకసామాన్యముగా మనుజుఁడూహించును.

క॥ తనవారులేనిచోటను
జనవించుకలేనిచోట ♦ జగడముచోటన్
అనుమానమైనచోటను
మనుజునకును నిలువఁదగదు ♦ మహిలోసుమతీ॥52

టీ॥ సుమతీ ! మహిలోన్=లోకమునందు, తనవారు=తన బంధువులు, లేనిచోటను=లేనిప్రదేశమునందును, చనువు=చనుమానము, ఇంచుక=కొంచెమయినను, లేనిచోటన్=లేనిస్థలము నందును, జగడముచోటన్ = పోరాటముగలస్థలమునందును, అనుమానము=సందేహము, ఐనచోటను=ఉన్నప్రదేశమునందును, మనుజునకున్ = మనుష్యునకు, నిలువన్ = నిలుచుట, తగదు=యోగ్యముకాదు.

తా॥ తనకత్యంతావశ్యకులులేనిచోటను, తనకుఁజనుమానములేని స్థలములందును, అనుమానముగలచోట్లను మనుష్యుఁడాగరాదు.

క॥ తమలముసేయనినోరును
రమణులచనుమొనలమీఁద ♦ రాయనిమేనుం
గమలములులేనికొలఁకును
హిమధాముఁడులేనిరాత్రి ♦ హీనముసుమతీ॥ 53

టీ॥ సుమతీ ! తమలము=తాంబూలము, సేయనినోరును= వేసికొననినోరును, రమణులచనుమొనలమీఁదన్ = కాంతలకు చాగ్రములందు, రాయనిమేనున్=నొరసికొననిశరీరమును, కమ

లములు=పద్మములు, లేనికొలఁకును=లేనట్టి సరస్సును, హిమధాముఁడు=చంద్రుఁడు, లేనిరాత్రి=ఉదయించనిరాత్రియును, హీనము=కాంతిహీనమైనవి.

తా॥ నోరు తాంబూలమునువేసికొనినచో శుభ్రముగానుండును, శరీరము రమణీకుచయుగాగ్రముల నొరసికొని సుఖమునిచ్చును, సరస్సునకు పద్మములు శోభతెచ్చును; రాత్రియందు చంద్రునివలన ప్రకాశముగలుగును. వేనికి వేనివలనశోభకలుగునో యవిలేనిచో రాణింపవు.

> క॥ తలనుండు విషము ఫణికిని
> వెలయుంగాఁ దోఁకనుండు ♦ వృశ్చికమునకుం
> దలదోఁకయనక యుండును
> ఖలునకు నిలువెల్లవిషము ♦ గదరాసుమతీ॥ 54

టీ॥ సుమతీ, ఫణికిని=పామునకు, విషము, తలన్=ముట్టె యందు, ఉండున్=ఉండును, వెలయుంగాన్=ఎక్కువగ, వృశ్చికమునకున్=తేలునకు, తోఁకయందు, ఉండున్=ఉండును, ఖలునకున్=దుష్టునికి, నిలువెల్లన్=శరీరమంతటను, విషముగదరా=విషముండునుగదా.

తా॥ పాములకు తలయందును, తేలునకు తోఁకయందును మాత్రము విషముండునుకాని దుర్మార్గునకు తలతోఁకయను నిర్ణయములేక యొళ్ళంతటను విషమేయుండును; కనుక దుర్మార్గునిజోలికిఁ బోవఁగూడదని తాత్పర్యము.

క॥ తలపొడుగుధనముఁబోసిన
వెలయాలికి నిజములేదు ♦ వివరింపంగాఁ
దలదడవి బాసఁజేసిన
వెలయాలిని నమ్మరాదు ♦ వినురాసుమతీ॥ 55

టీ॥ సుమతీ ! తలపొడుగు=తలయెత్తు, ధనముఁ=ధనమును, పోసినఁ=పోసినప్పటికిని, వెలయాలికిఁ=భోగముదానికి, నిజము=సత్యము, లేదు=(ముఖమునుండి) రాదు ; వివరింపంగాఁ= విచారింపఁగా, తలఁ=నెత్తిమీఁద, తడవి=చెయివేసి, బాసఁ= ప్రమాణము, చేసినఁ=చేసినప్పటికిని, వెలయాలిని=భోగము దానిని, నమ్మన్=నమ్ముట, రాదు=కూడదు, వినురా=వి నవోయి.

తా॥ నిలువెత్తును ధనము గుమ్మరించినను భోగముది నిష్కపటముగా మాటచెప్పదు. కాఁబట్టి నెత్తిమీఁదఁ జేయివె ట్టుకొని సత్యప్రమాణము చేసినను భోగముదానిని విశ్వసింప వలదు.

క॥ తలమాసిన నొలుమాసిన
వలువలుమాసినను బ్రాణ♦వల్లభునైనం
గులకాంతలైన రోఁతురు
తిలకింపఁగ భూమిలోనఁ ♦ దిరముగసుమతీ॥ 56

టీ॥ సుమతీ ; భూమిలోనఁ=ప్రపంచమందున, తిలకింపఁ గాఁ=ఆలోచింపఁగా, తల=తల, మాసినఁ=మాసినను,

ఒలు=శరీరము, మాసినఁ=మట్టిపట్టినను, ప్రాణవల్లభుఁ=మగనిని, ఐనఁ=అయినను, కులకాంతలు=కులస్త్రీలు, ఐనఁ=సయితము, తిరముగఁ=నిజముగా, రోఁతురు=అసహ్యపడుదురు.

తా॥ ప్రాణవల్లభుఁడైనను, తల మాయకుండినను శరీరము మట్టిపట్టకుండినను కట్టుకొనుబట్టలు మాయకనుండినను తక్క, లేనిచోఁ గులస్త్రీలకైనను రోఁతపుట్టకమానదు. కులస్త్రీలు కానివారివిషయమై వేఱుగఁ జెప్పనక్కఱయేలేదు.

క॥ తా ననుభవింపనర్థము (తాను సుఖింపని ద్రవ్యము)
మానవపతిఁ జేరుఁ గొంత ♦ మఱిభూగతమౌఁ
గానల నీఁగలుగూర్చిన
తేనియ యొరుఁ జేరునట్లు ♦ తిరము గ సుమతీ॥ 57

టీ॥ సుమతీ! కానలఁ=అడవులయందు, ఈఁగలు=తేనెటీఁగలు, కూర్చినతేనియ=కూడఁబెట్టినతేనె, ఒరుఁ=పరుని, చేరునట్లు=చేరువిధముగా, తాను, అనుభవింపని=ఉపయోగించుకొనని, అర్థము=ధనము, తిరముగఁ=నిజముగా, కొంత=కొంతభాగము, మానవపతిఁ=రాజును, చేరుఁ=చేరును, మఱి=మఱియును, కొంత = కొంతభాగము, భూగతము = నేలపాలు, ఔఁ=అగును.

తా॥ వనమునందు తేనెటీఁగలు పుష్పములనుండి తీసిన పూఁదేనె యీఁగలకు దొరకక పరులకు లభించునట్లు, మనుజుఁడు తానుపయోగింపక కూడఁబెట్టినధనము కొంత రాజులపాలును,

కొంతనేలపాలు నయిపోవును. అనఁగా ధనమును లోభించి కూడఁబెట్టక తగినరీతిని వెచ్చఁబెట్టవలయునని తాత్పర్యము.

క॥ దగ్గఱఁ గొండెముసెప్పెడు
పెగ్గడపలుకులకు రాజు ♦ ప్రియుఁడై మఱితా
నెగ్గు ప్రజ కాచరించుట
బొగ్గులకై కల్పతరువుఁ ♦ బొడుచుటసుమతీ॥ 58

టీ॥ సుమతీ! దగ్గఱన్=సమీపమున, కొండెము=అసత్యమును, చెప్పెడుపెగ్గడపలుకులకున్=చెప్పునట్టిప్రధానిమాటలకు, రాజు, ప్రియుఁడు=ఇష్టుఁడు, ఐ=అయి, మఱి=మఱియు, తాన్=తాను, ఎగ్గు=కీడును, ప్రజకున్=జనులకు, ఆచరించుట=చేయుట, బొగ్గులకై=మసిబొగ్గులకొఱకు, కల్పతరువున్=కల్పవృక్షమును, పొడుచుట=ఊడఁబెఱుకుటతో సమానము.

తా॥ మసిబొగ్గులు కావలసిన కోరినఫలములనన్నిటినిచ్చునట్టి కల్పవృక్షమునుగొట్టుట యెంతయోగ్యము గానుండునో లేనిపోని చాడీలుచెప్పునట్టి దుర్మంత్రిమాటలనునమ్మి రాజు ప్రజలను శిక్షించుటయు నట్లేయుండును.

క॥ ధనపతిసఖుఁడై యుండిన
నెనయంగా శివుఁడు భిక్ష ♦ మెత్తఁగవలసెం
దనవారి కెంతగలిగినఁ
దనభాగ్యమెతనకుఁగాక ♦ తథ్యము సుమతీ॥ 59

టీ॥ సుమతీ ! ధనపతి=కుబేరుఁడు, సఖుఁడు=స్నేహితుఁడు, ఐ=అయి, ఉండిన౯=ఉన్నప్పటికి, ఎనయంగా౯=పొందగునట్లు, శివుడు=ఈశ్వరుఁడు, భిక్షము=బిచ్చము, ఎత్తఁగవలసె౯=అడుగ వలసివచ్చెను ; తనవారికి౯=తనబంధువులకు, ఎంతగలిగిన౯= ఎంతయున్నను, తనభాగ్యమే=తనయదృష్టమె, తనకు౯=తనకు, కాక=అవునుగాక ; పరులసంపద తనకును దనసంపద పరులకును రానేరదు ; తథ్యము=యథార్థము.

తా॥ కుబేరుఁడు తన కెన్ని ధనములు పాతరలున్నను స్నేహితుఁడైన శివుఁడు భిక్షమెత్త వలసివచ్చెను. కాని శివునికి కుబేరుని భాగ్యమబ్బలేదు. కాఁబట్టి యెవరియదృష్టమువారి దేకాని యితరులకు రానేరదు.

క॥ ధీరులకుఁ జేయుమేలది
సారంబగునారికేళ ♦ సలిలముభంగి౯
గౌరవమున మఱిమీఁదట
భూరిసుఖావహమునగును ♦ భువిలో సుమతీ॥ 60

టీ॥ సుమతీ ! ధీరులకు౯=బుద్ధిమంతులకు, చేయుమేలు=చేసెడునుపకారమును, అది=ఆయుపకారము, నారికేళసలిలముభంగి౯=కొబ్బరికాయలోనీటివలె, సారము=శ్రేష్ఠము, అగు౯= అవును ; భువిలో౯=లోకములో, మఱి=అంతేకాక, మీఁదట౯ =పిదప, గౌరవమున౯ =గౌరవముతో, భూరిసుఖావహము౯=అధికమైనసౌఖ్యమును జేయునదియును, అగును=అవును.

తా॥ కొబ్బరిచెట్టును నీరుపోసి పెంచిన నది ఫలించి తిరిగి తియ్యనినీరును దియ్యనికొబ్బరియు నిచ్చునట్లు మంచిగుణముకల వారికి నుపకారముచేసినయెడల తిరిగి ప్రత్యుపకారమును బొందుటయేకాక మిగుల గౌరవమును సౌఖ్యమునుబొందఁగలరు.

క॥ నడువకుమీ తెరువొక్కటఁ
గుడువకుమీ శత్రునింటఁ ♦ గూరిమితోడన్
ముడువకుమీ పరధనముల
నుడువకుమీ యొరులమనసు ♦ నొవ్వఁగసుమతీ॥61

టీ॥ సుమతీ! ఒక్కటన్=ఒంటరిగా, తెరువు=మార్గమును, నడువకుమీ=త్రొక్కకుము, ప్రయాణముచేయకుము; కూరిమితోడ=ఇష్టముగా, శత్రునింటన్=విరోధియింట్లో, కుడువకుమీ=భోజనముచేయకుము. పరధనములన్=ఇతరులసొత్తును, ముడువకుమీ=మూటకట్టకుము, ఒరులమనసు=ఇతరులమనస్సు, నొవ్వఁగన్=నొచ్చునట్లు, నుడువకుమీ=మాట్లాడకుము.

తా॥ ఒంటరిగా దూరప్రయాణము చేయకూడదు; శత్రుగృహమున నిష్టముతో భుజింపరాదు, పరులధనము నపహరింపఁదగదు, వినువారికి కష్టముగలుగునట్లు మాటలాడవలదు,

క॥ నమ్మకు సుంకరి జూదరి
నమ్మకు మగసాలవాని ♦ నటువెలయాలిన్
నమ్మకు మంగడివానిని
నమ్మకుమీ వామహస్తు ♦ నవనినిసుమతీ॥ 62

టీ॥ సుమతీ! సుంకరిన్=పన్నువసూలుచేయువానిని, జూదరిన్=జూదమాడువానిని, నమ్మక=నమ్మకుము, అగసాలవానిన్=కంసాలివానిని, నమ్మకుము, అటు=ఆరీతిగానే, వెలయాలిన్=భోగముదానిని, నమ్మకుము, అంగడివానిని=దుకాణముపెట్టియమ్ముకొనువానిని, నమ్మకుము, అవనిని=భూమియందు, వామహస్తున్=పుట్ట చేతివానిని, నమ్మకుమీ=నమ్మకుసుమా.

తా॥ పన్నులు వసూలుచేయువానిని, జూదమాడువానిని, కంసాలివానిని, భోగముదానిని, అంగడివానిని, పుట్టచేతితో పసులుచేయువానిని, వీరిని నమ్మి కార్యములుచేసిన చివరకు నష్టముకలుగును.

క॥ నయమునఁ బాలుంద్రావరు
భయమునను విషమ్మునైన ♦ భక్షింతురుగా
నయమెంతదోసకారియొ
భయమే చూపంగవలయు ♦ బారుగసుమతీ॥ 63

టీ॥ సుమతీ! నయమునన్=మంచితనముచేత, పాలున్=పాలైనను, త్రావరు=త్రాగరు, భయమునన్=బెదరింపుచేత, విషమ్మును=విషమును, ఐనన్=అయినను, భక్షింతురుగా=తిందురుగదా, నయము=మెత్తఁదనము, ఎంతదోసకారియొ=ఎటువంటిదోషమునుజేయునదో, బాగుగన్=చక్కఁగా, భయమే=భయమునే, చూపంగవలయున్=కనపఱుపవలయును.

తా॥ మంచిమాటలుచెప్పి పాలుత్రాగుమన్నను త్రాగక

గారము చేయువారని కొంచెము సెకరించినచో విషమునుగూడ మిoగుదురు; కాఁబట్టి నయమున కార్యములు నెరవేరనియెడల భయపెట్టియే సాధించుకొనవలయును.

క॥ నరపతులు మేరఁదప్పినఁ
దిరముప్పఁగ విధవ యింటఁ ♦ దీర్పరియైనం
గరణము వైదికుఁడైనను
మరణాంతక మౌనుగాని ♦ మానదుసుమతీ॥ 64

టీ॥ సుమతీ! నరపతులు=రాజులు, మేరన్=హద్దును, తప్పినన్=తప్పినను, తిరము=స్థిరము, ఒప్పగన్=ఒప్పునట్లు, విధవ=పెనిమిటిపోయినస్త్రీ, ఇంటన్=గృహమునందు, తీర్పరి=న్యాయము చెప్పునది, ఐనన్=అయినను, కరణము=గ్రామకరణము, వైదికుఁడు=వేదాచారపరుఁడు, అలౌకికుఁడు, ఐనను=అయినను, మరణాంతకము=చావుపర్యంతము, ఔను=అవును, కాని, మానదు=తప్పదు.

తా॥ రాజులు న్యాయాన్యాయములు చూడకపోయినను, విధవకు ఇంట్లో పెత్తనమున్నను, గ్రామకరణమునకు లౌకికవ్యవహారములు తెలియకున్నను చావుసిద్ధము.

క॥ నవరసభావాలంకృత
కవితాగోష్ఠియును మధుర ♦ గానంబును దా
నవివేకి కెంతఁ జెప్పినఁ
జెవిటికి సంకూదినట్లు ♦ సిద్ధముసుమతీ॥ 65

టీ॥ సుమతీ ; తాఁ=తాను, అవివేకికిఁ=వివేకములేనివానికి, నవరస గోష్ఠియును ; నవ=తొమ్మిదియైన, రస=శృంగారాదిరసములతోను, భావ=భావములతోను, అలంకృత=అలంకరింపఁబడిన, కవితాగోష్ఠియును=కవిత్వప్రసంగమును, మధురగానంబును=చెవికింపైనసంగీతమును, ఎంతఁజెప్పినఁ=ఎంతయెక్కువచెప్పినను, చెవిటికిఁ=చెవిటివానికి, సంకు=శంఖము, ఊఁదినట్లు=పూరించినట్లే ; సిద్ధము=అందుకుసందేహములేదు.

తా॥ వివేకములేనిమూర్ఖునకు నవరసములతోడను కూడిన కవిత్వవిషయమైచెప్పినను మనోహరమైన సంగీతము నేర్పఁబోయినను, చెవిటివానికి శంఖమూఁదినను తెలియక నిరర్థకమైనట్లు లాభములేదు.

క॥ నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లిదండ్రి ♦ నాథులతోడఁ (నాయల)
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల ♦ నయమగుసుమతీ॥ 66

టీ॥ సుమతీ ; సభలోపలఁ=సభలయందు, నవ్వకుమీ=నవ్వకుము, తల్లిదండ్రినాయలతోడఁ=తల్లితోను, తండ్రితోను, ప్రభువుతోను, నవ్వకుమీ=నవ్వకుము, పరసతితో=ఇతరులభార్యతో, నవ్వకుమీ=వేళాకోళము చేయకుము, విప్రవరులఁ=బ్రాహ్మణోత్తములనుజూచి, నవ్వకుమీ=పరిహాసముచేయకు, నయము=మేలు, అగుఁ=అగును.

తా॥ సభలోనవ్వఁగూడదు, తలిదండ్రులతోను, అధికారితోను పరిహాసముఁ జేయరాదు, పరస్త్రీలతోనవ్వుచు భాషించఁ గూడదు, బ్రాహ్మణోత్తములతో నెగతాళిచేయరాదు.

క॥ నీరే ప్రాణాధారము
నోరే రసభరితమైన ♦ నుడువుల కెల్లన్
నారే నరులకు రత్నము
చీరే శృంగారమండ్రు ♦ సిద్ధము సుమతీ॥ 67

టీ॥ సుమతీ! నీరే=జలమే, ప్రాణాధారము=జీవనోపాధి, నోరే=ముఖమే, రసభరితమైన=రసముతో నిండిన, నుడువుల కున్=మాటలకు, ఎల్లన్=అన్నిటికిని, ఆధారము=సాధనము, నరులకున్=పురుషులకు, నారే=ఆఁడుదే, రత్నము=రత్నముతో సరియైన యాభరణమైనది, చీరే=చీరయే, శృంగారము=సింగారము, అండ్రు=అని చెప్పుదురు, సిద్ధము=నిజము.

తా॥ నీరు సమస్తజీవములకుఁ గూడ నాధారము, రసవంతముగ మాటాడుటకు నోరే సాధనము, మనుజులకందఱకును స్త్రీ శ్రేష్ఠమగు నలంకారమువంటిది, శృంగారమును చీరయే తెచ్చును.

క॥ పగవల దెవ్వరితోడను
వగవంగా వలదు లేమి ♦ వచ్చిన పిదపం
దెగనాడ వలదు సభలను
మగువకు మనసియ్యవలదు ♦ మహిలో సుమతీ॥ 68

టీ॥ సుమతీ! ఎవ్వరితోడను=ఏమనుష్యులతోను, పగ=వి

రోధము, వలదు=కూడదు, లేమి=దారిద్ర్యము, వచ్చినపిదపన్=వచ్చినతర్వాత, వగవంగాన్=విచారపడుట, వలదు=కూడదు, సభలను=సభలయందు, తెగన్=నిష్ఠురముగా, ఆడవలదు=మాట్లాడకూడదు, మహిలోన్=లోకమునందు, మగువకున్=స్త్రీకి, మనసు=తనమనస్సును (అనగా మనసులోని యభిప్రాయమును) ఇయ్యఁగూడదు=చెప్పకూడదు.

తా॥ ఎవ్వరితోను గలహింపఁగూడదు, దారిద్ర్యమువచ్చినప్పుడు ధైర్యము విడువకూడదు, సభలో నిష్ఠురముగా మాట్లాడరాదు, ఆడుదానితో మనసులోని యభిప్రాయమును వెల్లడింపకూడదు.

క॥ పతికడకుఁ దన్నుఁగూర్చిన
సతికడకును వేల్పుకడకు సద్గురుకడకున్
సుతుకడకు రిత్తచేతుల
మతిమంతులు చనరు నీతిమార్గము సుమతీ॥ 69

టీ॥ సుమతీ! పతికడకున్=ప్రభువుదగ్గఱకును, తన్నున్=తనను, కూర్చినసతికడకున్=ప్రేమించిన పెండ్లాముదగ్గఱకును, వేల్పుకడకున్=దేవునిదగ్గఱకును. సద్గురుకడకున్=యోగ్యుఁడైనగురువుదగ్గఱకును, సుతుకడకున్=కుమారునిదగ్గఱకును, రిత్తచేతులన్=ఉత్తచేతులతో, మతిమంతులు=బుద్ధిమంతులు, చనరు=వెళ్ళరు, నీతిమార్గము=అదియే న్యాయమార్గము.

తా॥ నీతిమార్గము నెఱిఁగిన బుద్ధిమంతులు, ప్రభువును, దే

వుని, గురువును, జూడఁదలఁచినపుడు వట్టిచేతులతో వెళ్ళరు ; ఫలము, పుష్పము మొదలగువానిని బట్టుకొనివెళ్ళి దర్శనము చేయవలెను. భార్యదగ్గఱకు బోవునపుడు ఆమెకు నిష్టమైనవస్తువును పట్టుకొనివెళ్ళవలెను. కుమారుని దగ్గఱకు బోవునప్పుడు తినెడువస్తువునేదేని పట్టుకొనిపోవలెను. అట్లు పట్టుకొనివెళ్ళనిచో నాదరింపరు.

క॥ పనిసేయునెడల దాసియు,
ననుభవమునరంభ, మంత్రి ♦ యాలోచనలం
దున, భుక్తియెడలఁ దల్లియు,
ననఁ దనకులకాంత యుండ♦నగురా సుమతీ॥ 70

టీ॥ సుమతీ ; పని=పనిని, చేయునెడలన్=చేయునప్పుడు, దాసియున్=దాసియు, అనుభవమునన్=భోగించునపుడు, రంభ=రంభయు, ఆలోచనలందున=ఆలోచనలయందు, మంత్రి=ప్రధానియు, భుక్తియెడలన్=భోజనముపెట్టుటయందు, తల్లియున్=తల్లియు, అనన్=అనునట్లు, తనకులకాంత=తనభార్య, ఉండన్=ఉండుట, అగురా=తగునుగదా.

తా॥ పనిపాటలుచేయునప్పుడు బద్ధకములేనిదాసివలెను, సంభోగమునందు రంభవలెను, ఆలోచనఁగావలసియున్నపుడు మంత్రివలెను, భోజనముపెట్టువేళ తల్లివలెను భార్య యుండవలెను.

క॥ పరనారీసోదరుఁడై
పరధనములకాసపడక ♦ పరులకుహితుఁడై

పరులు దనుఁబొగడ నెగడియుఁ
బరు లలిగిన నలుగనతఁడు ♦ పరముఁడు సుమతీ॥ 71

టీ॥ సుమతీ ! పరనారీసోదరుఁడై = పరస్త్రీలకుఁదోఁబుట్టువై, పరధనములకుఁ = ఇతరులద్రవ్యములకు, ఆసపడక = ఆశపడక, పరులకుఁ = ఇతరులకు, హితుఁడై = ఇష్టుఁడై, పరులు = ఇతరులు, తనుఁ = తనను, పొగడఁ = స్తోత్రముచేయఁగా, నెగడియుఁ = వృద్ధినొందియు, పరులు = ఇతరులు, అలిగినఁ = కోపపడఁగా, అలుగనతఁడు = కోపించనివాఁడు, పరముఁడు = ఉత్తముఁడు.

తా॥ పరస్త్రీలయెడ సోదరునివలె ప్రవర్తించినవాఁడును, పరులధనమును గోరనివాఁడును, లోకులకిష్టమైనవాఁడును, పరులు తననుమెచ్చునట్లు నడుచుకొనువాఁడును, ఇతరులుకోపపడినను తానునెమ్మదిగలవాఁడును నయినవాఁడే సర్వోత్తముఁడు.

క॥ పరసతికూటమిఁగోరకు
పరధనముల కాసపడకు ♦ పరు నెంచకుమీ
సరిగానిగోష్ఠి సేయకు
సిరిచెడి చుట్టంబుకడకుఁ ♦ జేరకుసుమతీ॥ 72

టీ॥ సుమతీ! పరసతికూటమిఁ = పరస్త్రీలతోస్నేహమును, కోరకు = ఇష్టపడకుము, పరధనములకుఁ = ఇతరులద్రవ్యములకు, ఆసపడకు = ఆశపడకుము, పరుఁ = ఇతరుని, ఎంచకుమీ = తప్పెంచకము, సరి = యుక్తము, కానిగోష్ఠి = కుండనిప్రసంగమును, చేయకు = చేయకుము, సిరి = సంపద, చెడి = పోయినప్పుడు, చుట్టం

బుకడకుఁ=బంధువునొద్దకు, చేరకు=వెళ్ళకు.

తా॥ పరస్త్రీనిబొందఁగోరవలదు, పరధనములనాశింపరాదు, పరునిదూషించవలదు, కుండనిప్రసంగముచేయకూడదు, తనకు సందపలేనప్పుడు బంధువులకడకు తఱచుపోఁగూడదు, వెళ్ళిన మర్యాదయుండదనుట.

క॥ పరసతులగోష్ఠినుండిన
పురుషుఁడు గాంగేయుఁడైన ♦ భువి నిందపడుం
బరసతి సుశీలయైనను
బరుసంగతినున్న నింద♦పాలగు సుమతీ॥ 73

టీ॥ సుమతీ! భువిఁ=భూమియందు, పరసతులగోష్ఠిఁ=ఇతరస్త్రీలప్రసంగమున, ఉండినపురుషుఁడు=ఉన్నమగవాఁడు, గాంగేయుఁడు=భీష్మాచార్యులు, ఐనఁ=అయినప్పటికి, నిందపడుఁ=అపకీర్తినిఁబొందును, పరసతి=పరస్త్రీ, సుశీల=మంచిస్వభావముకలది, ఐనఁ=అయినప్పటికీ, పరసంగతిఁ=ఇతరపురుషునిసాంగత్యముతో, ఉన్నఁ=ఉండినయెడల, నిందపాలు=అపకీర్తి తెచ్చుకొన్నది, అగుఁ=అవును.

తా॥ పురుషుఁడు భీష్మాచార్యునివంటి యస్ఖలితబ్రహ్మచారియైనను పరస్త్రీగోష్ఠినల్పునేని లోకమునందు నిందాపాత్రుఁడగును ; స్త్రీయును పరపురుషులసంగతినున్నయెడల, నెంతమంచిగుణములుకలదైనను నింద్యురాలగును.

క॥ ఒరునాత్మఁ దలఁచుసతి విడు
మఱుమాటలు పలుకుసుతుల ♦ మన్నింపకుమీ
వెఱపెఱుఁగని భటునేలకు
తఱచుగ సతిఁగవయఁబోకు ♦ తగదుర సుమతీ॥ 74

టీ॥ సుమతీ! ఒరున్=పరుని, ఆత్మన్=మనస్సునందు, తలఁచుసతిన్=తలఁచునట్టిస్త్రీని, విడు=విడిచిపెట్టుము, మఱుమాటలు=బదులు మాటలు, పలుకుసుతులన్=ఆడునట్టికుమారులను, మన్నింపకుమీ=ఆదరింపకుము, వెఱపు=భయము, ఎఱుఁగనిభటున్=తెలియనిసేవకుని, ఏలకు=రక్షింపకుము, తఱచుగన్=పలుమాఱు, సతిన్=స్త్రీని, కవయన్=భోగించుటకు, పోకు=పోవకుము, తగదుర=కూడదుగదా.

తా॥ ఇతరునియందు మనస్సుగలభార్యను త్యజింపవలెను; ఎదిరించిమాట్లాడుకొడుకులను జేరఁదీయవలదు, భయముగఁబని చేయని సేవకుని మాన్పింపవలెను, తఱచుగా స్త్రీసంగమము కూడదు.

క॥ పరులకు నిష్టముచెప్పకు
పొరుగిండ్లకుఁ బనులులేక ♦ పోవకుమెపుడుం
బరుఁగదిసిన సతిఁగవయకు
మెఱిఁగియు బిరుసైనహయము ♦ నెక్కకుసుమతీ॥

టీ॥ సుమతీ! పరులకున్=ఇతరులకు, ఇష్టము=మనసులోనున్నయభిప్రాయమును, చెప్పకు=చెప్పకుము, పనులు=కార్య

ములు, లేక=లేకుండఁగ, పొరుగిండ్లకుఁ=దగ్గఱగృహములకు, ఎపుడుఁ=ఏవేళనైనను, పోవకుము=వెళ్ళకుము, పరుఁ=పరపురుషుని, కదిసినసతిఁ=పొందినస్త్రీని, కవయకుము=రమింపకుము, ఎఱిఁగియుఁ=ఎఱిఁగియుండియు, బిరుసు=మోటు, ఐన హయముఁ=అయినగుఱ్ఱమును, ఎక్కకు.

తా॥ తనయభిప్రాయమునందఱితోడను జెప్పకూడదు ; దగ్గఱనున్న యిండ్లకైనను నవసరము లేకుండఁగఁ బోరాదు ; పరునితోఁ గూడినస్త్రీని ప్రేమింపరాదు ; మోటుగుఱ్ఱముమీఁద స్వారిచేయకూడదు.

క॥ పర్వముల సతులఁ గవయకు
ముర్వీశ్వరుకరుణనమ్మి ♦ యుబ్బకుమదిలోఁ
గర్వింపనాలిఁ బెంపకు
నిర్వాహములేనిచోట ♦ నిలువకుసుమతీ॥ 76

టీ॥ సుమతీ ! పర్వములఁ=అమావాస్యమొదలగు పర్వపు రోజులలో, సతులఁ=స్త్రీలను, కవయకుము = రమింపకుము, ఉర్వీశ్వరుకరుణఁ=రాజుయొక్క దయను, నమ్మి = నమ్ముకొని, మదిలోఁ=మనసునందు, ఉబ్బకు=పొంగకుము, గర్వింపఁ=గర్వముకలుగునట్లు, ఆలిఁ=భార్యను, పెంపకు=లాలనముచేయకుము, నిర్వాహము=జరగుబాటు, లేనిచోటఁ లేనిస్థలమందు, నిలువకు=ఉండకుము.

తా॥ అష్టమి, ఏకాదశి, పూర్ణిమ, అమావాస్య, చతుర్దశి,

సంక్రాంతిమొదలగు పర్వపుదినములందు స్త్రీలతోఁ గూడఁగూడదు, రాజులదయ శాశ్వతమని నమ్మిప్రొంగరాదు, పొగరెక్కులాగున భార్యకు చనువియ్యఁదగదు, జరగుఁబాటులేనిచోట నిలువరాదు.

క॥ పలుదోమి సేయువిడియము
తలగడిగిననాఁటినిద్ర ♦ తరుణులయెడలం
బొలయలుకనాఁటికూటమి
వెల యింతని చెప్పరాదు ♦ వినురాసుమతీ॥ 77

టీ॥ సుమతీ! పలు=దంతములను, తోమి=తోముకొని, చేయువిడియము=వేసికొన్న తాంబూలమును, తలగడిగిననాఁటినిద్ర=తలయంటుకొనినరోజునఁ బోవునిద్రయును, తరుణులయెడలన్=స్త్రీలవిషయమున, పొలయలుకనాఁటికూటమి=ప్రణయకోపముఁగలిగినరోజునఁ జేయుసంగమమును, ఇంత=ఇంతప్రమాణముగల, వెల=విలువ, అని, చెప్పరాదు=చెప్పుటకష్టము, వినురా=వినుము.

తా॥ పండ్లుతోముకొని వేసిన తాంబూలము, తలయంటుకొనిననాఁటినిద్ర, ప్రణయకోపముగల్గిననాఁటి రతియును బహుసుఖమును గలుగఁజేయును.

క॥ పాటెఱుఁగనిపతికొలువును,
గూటంబున కెఱుకపడని ♦ కోమలిరతియుం

బేసెత్త జేయు చెలిమియు
నేటికి నెదురీదినట్లు ♦ లెన్న గ సుమతీ॥ 78

టీ॥ సుమతీ ! పాటు=కష్టమును, ఎఱుఁగనిపతికొలువును= తెలిసికొననిప్రభుసేవయు, కూటంబునకుఁ=సంగమమునకు, ఎఱుక...రతియుఁ, ఎఱుకపడని=తెలిసికొనని, శృంగారమెఱుఁగని, కోమలి=స్త్రీయొక్క, రతియుఁ=సంభోగమును, పేసెత్తఁ= గౌరవముచెడిపోవునట్లు, చేయుచెలిమియుఁ=చేయునట్టిస్నేహమును, ఎన్నగఁ=ఊహింపఁగా, ఏటికిఁ=నదికి, ఎదురు=ఎదురుగా, ఈఁదినట్లు=ఈదినరీతి.

తా॥ కష్టసుఖములనుజూడనిరాజును సేవించుటయు, రతిసౌఖ్యమునెఱుఁగని స్త్రీసంభోగమును, గౌరవమూతక్కనిస్నేహమును, నదీప్రవాహమున కెదురుగానీఁదునట్లు బహుకష్టమును, దుఃఖకారణమునగును.

క॥ పాలనుగలిసిన జలమును
బాలవిధంబుననెయుండుఁ ♦ బరికింపఁగాఁ
బాలచవిఁ జెఱచుఁ గావునఁ
బాలసుఁడగువానిపొందు ♦ వలదురసుమతీ॥ 79

టీ॥ సుమతీ ! పాలను=పాలయందు, గలిసినజలమును=కలిసియున్ననీరుసైతము, పరికింపంగాఁ=విచారింపఁగా, పాలవిధంబుననె=పాలవలెనే తెల్లగా, ఉండుఁ=ఉండును, పాలచవిఁ= పాలయొక్కరుచిని, చెఱచుఁ=చెడఁగొట్టును, కావునఁ=

కాఁబట్టి, పాలసుఁడు=దుర్జనుఁడు, అపువానిస్నేహము=అయినవా
నిస్నేహము, వలదురా=కూడదు.

తా॥ పాలలోఁ గలిసిన నీరుకూడ, పాలవలె తెల్లగానుండును
కాని యాపాలయొక్క రుచిని బోఁగొట్టును, కాఁబట్టి నీచుని
తోస్నేహము చెఱుపునకే యగును.

క॥ పాలసునకైన యాపద
జాలింబడి తీర్పవలదు ♦ సర్వజ్ఞునకుం
దే లగ్నిఁబడఁగఁ బట్టిన
మేలెఱుఁగునె మీఁటుఁగాక ♦ మేదినిసుమతీ ॥ 80

టీ॥ సుమతీ! మేదిని=లోకమందు, పాలసునకున్=దుష్టునకు,
ఐనయాపదన్=కలిగినయాపత్తును, జాలిన్=దయను, పడి=పొం
ది, తీర్పన్=తీర్చుట, సర్వజ్ఞునకున్=అన్నియుఁ దెలిసినవానికైన,
వలదు=కూడదు, తేలు, అగ్నిన్=నిప్పులలో, పడఁగ=పడుచుం
డఁగా, పట్టినన్=పట్టుకొనినయెడల, మీఁటున్=కుట్టును, కాక=
కానియెడల, మేలు=ఉపకారమును, ఎఱుఁగునె=ఎఱుఁగునా.

తా॥ దుర్జనునికి ఆపత్తువచ్చినప్పుడు సహాయముచేసినయె
డల, నిప్పులోఁబడకుండఁ దేలును పట్టుకొనఁగా చేతినికుట్టినట్లు,
తిరిగియుపకారమునుజేయుటకు మాఱుగా కీడు చేయఁదలఁచును.
కాఁబట్టి దుర్మార్గునికి సహాయము చేయరాదు.

క॥ పిలువనిపనులకుఁబోవుట
గలయనిసతిరతియు రాజు♦గానని కొలువుం

బిలువని పేరంటంబును
వలవని చెలిమియును జేయ ♦ వలదుర సుమతీ॥ 81

టీ॥ సుమతీ ; పిలువని పనులకుఁ=పిలువని కార్యములకు, పోవుట=వెళ్ళుట, కలయని సతిరతియుఁ=అనుకూలింపని స్త్రీతో రమించుటయు, రాజు=ప్రభువు, కానని కొలువుఁ=కనిపెట్టని, యుద్యోగమును, పిలువని పేరంటంబుఁ=రమ్మని పిలువని పేరంటమును, వలవని చెలిమియును=కూడని స్నేహమును, చేయఁ=చేయుట, వలదుర=తగదు సుమీ.

తా॥ పిలువని పనులకు వెళ్ళుటయు, మనిసిచ్చి కలియని స్త్రీతో గూడుటయు, రమ్మనకుండా పేరంటమునకు వెళ్ళుటయు, కూడని స్నేహమును జేయరాదు.

క॥ పురికిని బ్రాణము కోమటి
వరికిని బ్రాణంబు నీరు ♦ వసుమతిలోనం
గరికిని బ్రాణము తొండము
సిరికిని బ్రాణంబు మగువ ♦ సిద్ధము సుమతీ॥ 82

టీ॥ సుమతీ ! వసుమతిలోనఁ=భూమియందు, పురికిని=పట్టణమునకు, కోమటి=వైశ్యుఁడు, ప్రాణము=జీవమువంటివాఁడు, వరికిని=వరిపైరునకు, నీరు=జలము, ప్రాణంబు=జీవము, కరికిని=ఏనుఁగునకు, తొండము, ప్రాణము=జీవము, సిరికిని=సంపదకు, మగువ=స్త్రీ, ప్రాణంబు=జీవము, సిద్ధము=నిజము.

తా॥ పట్టణమునకు కోమటియు, వరిపైరునకు నీరును, ఏనుఁగునకు తొండమును, సంపత్తునకు అందుడియును జీవనాధారములు.

క॥ పులిపాలు తెచ్చియిచ్చిన
నలవడఁగా గుండెగోసి ♦ యఱచేనిడినం
దలపొడుగు ధనముపోసిన
వెలయాలికిఁ గూర్మిలేదు ♦ వినురాసుమతీ॥ 83

టీ॥ సుమతీ! పులిపాలు=పెద్దపులియొక్క పాలను, తెచ్చి=తీసికొనివచ్చి, ఇచ్చినన్=ఇచ్చినను, అలవడఁగాన్=అధీనముగు నట్లు, గుండె=గుండెను, కోసి=కత్తితోకోసి, అఱచేన్=అఱచేతియందు, ఇడినన్=పెట్టినప్పటికిని, తలపొడుగు=తలయెత్తు, ధనము=ధనమును, పోసినన్=సమర్పించినను, వెలయాలికిన్=భోగముదానికి, కూర్మి=ప్రేమ, లేదు, వినురా=వినుము.

తా॥ పులిపాలను తీసికొనివచ్చి యిచ్చినను, గుండెకోసి చేతి కిచ్చినను, నిలువెత్తున ధనముపోసినను భోగముదానికి నిజమైన ప్రేమ కలుగదు.

క॥ పెట్టినదినములలోపల
నట్టడవులకైన వచ్చు ♦ నానార్థములు
బెట్టనిదినమునఁ గనకపు
గట్టెక్కిన నేమిలేదు ♦ గదరాసుమతీ॥ 84

టీ॥ సుమతీ ! పెట్టినదినములలోపలన్ = పెట్టిపుట్టినదినములందు (అనఁగా వెనుకటిజన్మమునందు ఒకరికి దానము చేసి పుణ్యము చేసికొనుట) నట్టడవులకైనన్ = అడవులమధ్యమునకైనను, నానార్థములున్ = సకలపదార్థములును, వచ్చున్ = వచ్చును, పెట్టనిదినములన్ = (పూర్వజన్మమున) ఒకరికి పెట్టియుండనిదినములలో, కనకపుగట్టు = బంగారపుకొండను (అనగా మేరుపర్వతమును) ఎక్కినన్ = ఎక్కినను, ఏమి = ఏమియును, లేదుగదరా = లభింపదుగదా.

తా॥ పూర్వజన్మములలో పెట్టిపుట్టినయెడల, నడవులలో నట్టనడుమను నివసించినను సకలార్థములు కలుగును; పూర్వజన్మమునందు పెట్టిపుట్టనియెడల మేరుపర్వతముమీఁద కాపురమున్నను ఏమియు రాదు.

క॥ పొరుగునఁ బగవాఁడుండిన
నిరవొందఁగ వ్రాఁతకాఁడె ♦ యేలికయైనం
ధరఁగాఁపుకొండెఁడైనను
గరణాలకు బ్రతుకులేదు ♦ గదరాసుమతీ॥ 85

టీ॥ సుమతీ ! ధరన్ = భూమియందు, పొరుగునన్ = ప్రక్కను, పగవాఁడు = విరోధి, ఉండినన్ = నివసించినను, ఇరవొందఁగన్ = అనుకూలముగా, ఏలిక = ప్రభువు, వ్రాఁతకాఁడె = వ్రాయనేర్చుకొన్నవాఁడే, ఐనన్ = అయినను, కాఁపు = వ్యవసాయము చేయువాఁడు, కొండెఁడు = చాడీచెప్పువాఁడు, ఐనను = ఐనను, కర

కాలకున్=గ్రామకరణములకు, బ్రదుకు=జీవనము, లేదుగద రా=ఉండదుగదా.

తా॥ పొరుగునశత్రువుండినను, వ్రాయను జదువను దెలిసినవాఁడు రాజైనను, వ్యవసాయముచేయువాఁడు చాడీకోరైనను, కరణమునకే ధనమువిశేషముగా లభింపదు.

క॥ బంగారు కుదువఁబెట్టకు
సంగరమునఁ బాఱిపోకు ♦ సరసుఁడవైతే
నంగడి వెచ్చములాడకు
వెంగలితోఁ జెలిమివలదు ♦ వినురాసుమతీ॥ 86

టీ॥ సుమతీ ! సరసుఁడవు=రసజ్ఞుఁడవు, ఐతేన్=అయినపక్షమున, బంగారు=బంగారమును, కుదువఁబెట్టకు=తాకట్టుపెట్టకుము, సంగరమునన్=యుద్ధమందు, పాఱిపోకు=వెనుకకుతిరిగి పరుగెత్తిపోవకుము, అంగడిన్=రచ్చయందు, వెచ్చములు=ఇంట్లోవాడుకొనువస్తువులకై చేసినఅప్పులనుగుఱించి, ఆడకుము=చెప్పకొనకుము, వెంగలితోన్=మూఢునితో, చెలిమి=స్నేహము, వలదు=కూడదు, వినురా=వినుము.

తా॥ రసజ్ఞుఁడు, బంగారమును గుదువఁబెట్టఁడు, యుద్ధమునందు పాఱిపోఁడు, ఇంట్లో వాడుకొనుటకయిన చిల్లరయప్పులను వెల్లడింపఁడు, మూర్ఖునితో సహవాసముచేయఁడు. ఎట్టివాఁడును సరసుఁడు కావలయుననిభావము.

క॥ బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి ♦ పలుకుట మేలా ?
బలవంతమైన సర్పము
చలిచీమల చేతఁజిక్కి ♦ చావదె సుమతీ॥ 87

టీ॥ సుమతీ ! బలవంతుఁడ=బలముకలవాఁడను, నాకున్=నాకు, ఏమి=ఏమిలోటు, అని=అనుకొని, పలువురతోన్=చాల మందితో, నిగ్రహించి=కలహించి, పలుకుట=మాటలాడుట, మేలా=మంచిదా ? కాదు ! బలవంతము=బలముకలది, ఐనసర్పము=అయినపాము, చలిచీమలచేతన్=నల్లని చిన్నచీమలు చేత, చిక్కి=తగులుకొని, చావదె=చచ్చిపోవదా ? చచ్చిపోవును.

తా॥ చిన్నచీమలు బారులుగాకూడి పెద్దబలమైన పామును చంపఁగలుగునట్లు పలుగురు మనుష్యులు కూడి యెంతబల శాలినైనను లక్ష్యపెట్టరు, కనుక బలవంతుఁడైనను అందరి తోడను గలహింపఁగూడదు.

క॥ మండలపతి సముఖంబున
మెండైన ప్రధాని లేక ♦ మెలఁగుట యెల్లం
గొండంత మదపుటేనుఁగు
తొండము లేకుండినట్లు ♦ దోఁచుర సుమతీ॥ 88

టీ॥ సుమతీ, మండలపతిసముఖంబునన్=రాజుయొక్క సన్నిధానమున, మెండైనప్రధాని=సామర్థ్యముగలమంత్రి, లేక=లేకుండఁగ, మెలఁగుట=ప్రవర్తించుట, ఎల్లన్=అంతయును,

కొండంతమదపుటేనుఁగు=పర్వతమంత మదగజము, తొండము, లే కుండినట్లు=లేకుండినవిధము, తోఁచుర=తోఁచునుగదా,

తా॥ కొండంత పెద్దయేనుఁగుకూడ తొండములేనియెడల బ లమెంతయును బనికిరానియట్లు, రా జెంతగొప్పవాఁడైనను మం త్రిలేనియెడల రాజ్యము చేయుట కష్టము.

క॥ మంత్రిగలవాని రాజ్యము
తంత్రముసెడకుండనిలుచుఁ ♦ దఱుచుగ ధరలో
మంత్రివిహీనుని రాజ్యము
జంత్రపుఁగీ లూడినట్లు ♦ జరగదుసుమతీ॥ 89

టీ॥ సుమతీ ; మంత్రిగలవానిరాజ్యము=పధానినిబెట్టినరా జుయొక్క ప్రభుత్వము, తంత్రము=యోచన, చెడకుండఁగ=చె డిపోవకుండఁగ, నిలుచుఁగ=నిలుచును, తఱుచుగ=విశేషము గా, ధరలోఁగ=భూమియందు, మంత్రివిహీనునిరాజ్యము=మం త్రిలేనివానిరాజ్యము, జంత్రపుకీలు=యంత్రముయొక్క మఱ, ఊడినట్లు=ఊడిపోయినరీతిగా, జరగదు=సాగదు.

తా॥ రాజుమంత్రిసహాయమున రాజ్యము చక్కఁగాఁజేయఁ గలుగును. సలహాచెప్పుటకు మంత్రిలేనియెడల మఱలూడిపోయి న యంత్రమువలె రాజ్యము బాగుగజరగనేరదు.

క॥ మాటకుఁ బ్రాణముసత్యము
కోటకుఁబ్రాణంబు సుభట ♦ కోటి ధరిత్రిఁ

బోటికిఁ బ్రాణము మానము
చీటికిఁ బ్రాణంబు వ్రాలు ♦ సిద్ధము సుమతీ॥ 80

టీ॥ సుమతీ ! ధరిత్రిన్ = భూమియందు, మాటకున్ = పలుకునకు, ప్రాణము = జీవము, సత్యము = యదార్థము, కోటకున్ = కోటకు, ప్రాణంబు = జీవము, సుభటకోటి = దిట్టమైన బంటుల సమూహము, బోటికిన్ = స్త్రీకి, ప్రాణము = జీవము, మానము = గౌరవము లోపము లేకుండ సంచరించుట ; చీటికిన్ = ఉత్తరమునకు, వ్రాలు = చేవ్రాలు, ప్రాణంబు = జీవము, సిద్ధము = నిజము.

తా॥ సత్యమే మాటకు ప్రాణమువంటిది అనఁగా, సత్యవాక్కు మనుష్యుని ప్రాణమువలెఁ గాపాడును ; దిట్టమైన బంట్రౌతులున్న కోటకు భంగము కలుగదు. ఒకరిచే మాటపడకుండ మెలఁకువతో నుండిన స్త్రీకి శ్రేయస్సు వచ్చును ; చేవ్రాలున్న చీటి చెల్లును, చేవ్రాలు లేని చీటి యెక్కడను చెల్లదు.

క॥ మానఘనుఁ డాత్మధృతి చెడి
హీనుండగువాని నాశ్ర ♦ యించుట యెల్లం
మానెడు జలములలోపల
నేనుఁగు మెయి దాఁచినట్లు ♦ లెఱుఁగుము సుమతీ॥ 81

టీ॥ సుమతీ ! మానఘనుఁడు = మిక్కిలి యభిమానము గలవాఁడు, ఆత్మన్ = తన హృదయమందు, ధృతి = ధైర్యము, చెడి = పోయి, హీనుండు = నీచుఁడు, అగు వానిన్ = అయినవానిని, ఆశ్రయించుట = సేవించుట, ఎల్లన్ = అంతయు, మానెడు జలముల

లోపలన్=శేరునీళ్ళలో, ఏనుఁగు, మెయి=తనశరీరమును, దాఁచి నట్టులు=మరుగుపఱుచుకొనునట్లు, ఎఱుఁగుము=తెలిసికొనుము.

తా॥ మానవంతుఁడు నీచుని ఆశ్రయించుట చూడఁగా ఏనుఁగు తనశరీరమును మానెడునీళ్ళలో దాఁచుకొన్నట్లుగ నుండును. అనఁగా మానవంతుఁడు నీచునియాశ్రయింపలేఁడని భావము.

క॥ రాపొమ్మని పిలువనియా
భూపాలునిఁగొల్వఁ భుక్తి ♦ ముక్తులుగలవే
దీపంబులేని యింటను
జేపుర కళ్లాడినట్లు ♦ సిద్ధముసుమతీ॥ 92

టీ॥ సుమతీ! రా=రమ్ము, పొమ్ము=వెళ్ళుము, అని, పిలువనియాభూపాలునిన్=పిలువనట్టియారాజును, కొల్వన్=సేవించుటవలన, భుక్తిముక్తులు=భుక్తియును ముక్తియును అనఁగా ఇహలోకసుఖమును, పరలోకసుఖమును, కలవే=ఉన్నవా! దీపంబు=దీపము, లేనియింటను=ఉండనిగృహమునందు, చేపురకళ్లు=చేసట్టులాటలు, ఆడినట్లు=ఆడినవిధముగనుండును. సిద్ధము=నిజము.

తా॥ దీపముపెట్టని గృహమునందు శృంగారచేష్టలుచేసిన చో నది సరసముగాను సుఖముగాను నుండదు. ఆవిధముగానే అవసరమయినప్పుడు రమ్మనిపిలిచియు లేనప్పుడువెళ్లుమనిచెప్పియు నాదరింపని ప్రభువుదగ్గఱ సేవించుటవలన సుఖములేదు.

క॥ రూపించిపలికి బొంకకు
ప్రాపగుచుట్టంబు నెగ్గు ♦ పలుకకు మదిలోఁ
గోపించు రాజుఁ గొల్వకు
పాపపు దేశంబుసొరకు ♦ పదిలముసుమతీ॥ 92

టీ॥ సుమతీ! రూపించి=నిర్ధారణచేసి, పలికి=చెప్పి, బొంకకు=అసత్యమాడకుము, ప్రాపు=ఆధారము, అగుచుట్టంబుఁ=అయిన బంధువునుగూర్చి, ఎగ్గు=కీడును, పలుకకు=చెప్పకుము, మదిలోఁ=మనస్సునందు, కోపించు రాజుఁ=కోపమునట్టిప్రభువును, కొల్వకు=సేవింపకుము, పాపపు దేశంబు=పాపముగలుగు స్థలమును, చొరకు=ప్రవేశింపకుము, పదిలము=జాగ్రత్త.

తా॥ నిర్ధారణముగా ముందుచెప్పి తరువాత అట్లుకాదని బొంకకూడదు; సాహాయ్యభూతుఁడైన బంధువును దూషింపకూడదు, కోపముగలరాజును సేవింపరాదు, సుఖముబ్బరానిస్థలమును ద్రొక్కకూడదు.

క॥ లావుగలవానికంటెను
భావింపఁగ నీతిపరుఁడు ♦ బలవంతుండౌ
గ్రావంబంతగజంబును
మావటివాఁడెక్కినట్లు ♦ మహిలోసుమతీ॥ 93

టీ॥ సుమతీ! మహిలోఁ=భూమియందు, గ్రావంబంతగజంబును=కొండంత యేనుఁగును, మావటివాఁడు=మావటీఁడు, ఎక్కినట్లు=ఎక్కినలాగున, లావు=శక్తి, కలవానికంటెను=కలిగి

నవానికంటె, భావింపఁగన్=ఊహింపఁగా, నీతిపరుఁడు=న్యాయమార్గమునందాసక్తిగలవాఁడు, బలవంతుండు=బలముగలవాఁడు, ఔన్=అగును.

తా॥ గొప్పబలమును పొడుగునుగల ఏనుఁగునుఎక్కి చిన్నవాఁడైనను నేర్పుగలమావటివాఁడు తనకు స్వాధీనముచేసికొనినట్లు బలహీనుఁడైనను తెలివిగలవాఁడు ఎంతబలవంతునినైనను వశపఱుచుకొనఁగలఁడు.

క॥ వఱదైన చేనుదున్నకు
కఱవైనను బంధుజనుల ♦ కడ కేఁగకుమీ
పరులకు మర్మము సెప్పకు
పిఱికికిదళవాయితనము ♦ పెట్టకుసుమతీ॥

టీ॥ సుమతీ; వఱద=నీటివెల్లువగలది, ఐన చేను=అయినపొలమును, దున్నకు=దుక్కకును, కఱవు=కఱవుకాలము, ఐనను=అయినను, బంధుజనులకడకున్=చుట్టములయొద్దకు, ఏఁగకుమీ=వెళ్ళకుసుమీ, పరులకున్=ఇతరులకు, మర్మము=రహస్యమును, చెప్పకు=చెప్పకుము, పిఱికికిన్=పిఱికివానికి, దళవాయితనము=సేనానాయకత్వమును, పెట్టకు=కలుగఁజేయకుము.

తా॥ వఱదలువచ్చి ప్రవహించు పొలమును దున్నతగదు, కఱవుకాలమందైనను బంధువులయింటికి వెళ్ళవలదు; రహస్యప్రసంగముల నితరులతో చెప్పకూడదు, పిఱికిపందను సేనాధిపతిగాఁజేయరాదు.

క॥ వరిపంట లేని యూరును
దొరయుండనియూరు తోడు ♦ దొరకని తెరువున్
ధర నృపతి లేనిగృహము
నరయంగా రుద్రభూమి ♦ యనఁదగు సుమతీ॥ 76

టీ॥ సుమతీ! ధరన్=భూమియందు, వరపంట=వడ్లపంట, లేనియూరును=పండనిగ్రామమును, దొర=ప్రభువు, ఉండని యూరు=లేనిగ్రామమును, తోడు=సహాయము, దొరకని తెరువున్=లభింపనిప్రయాణము ను, నృపతి=రాజు, లేనిగృహము ను=ఉండనియిల్లును, అరయుంగాన్=ఆలోచింపఁగా, రుద్రభూమి=శ్మశానప్రదేశము, అనన్=అని చెప్పఁగా, తగున్=ఒప్పును.

తా॥ వరిసస్యముపండనిగ్రామమును, రాజు లేనియూరును, సహాయము లేని దూరప్రయాణమును, యజమానుఁడు లేని యిల్లును పాడుభూమితోసమానములు అనఁగా అట్టిచోట్లజీవించుటకష్టమని తాత్పర్యము.

క॥ వలరసము సతికిఁబుట్టక
బలిమినిదమకించి విటుఁడు ♦ పైకొనుటెల్లన్
మలయజముసానమీఁదను
జలముంపకతీసినట్టి ♦ చందము సుమతీ॥ 97

టీ॥ సుమతీ! వలరసము=మన్మథోద్రేకము, సతికిన్=స్త్రీకి, పుట్టక=కలుగకుండ, తమకించి=ఆతురపడి, బలిమిని=బలవంతముగా, విటుఁడు = విటకాఁడు, పైకొనుట = సంభోగించుట,

ఎల్లన్=అంతయు, సానమీఁదను=సానపైని, జలము=నీరు, ఉంపక=పోయక, మలయజమున్=గంధమును, తీసినట్టిచందము=అరఁగఁదీసినవిధముగనుండును.

తా॥ సానమీఁదఁగొంచెమైననునీళ్ళుచల్లకుండ గంధముతీయుట ఎట్లున్వృథాయాసమో కామవికారమునుపుట్టఁజేయకుండఁగ స్త్రీని రమించుట విరసముగనుండును.

క॥ వినఁదగునెవ్వరు సెప్పిన
విని నంతనె వేగపడక ♦ వివరింపఁదగున్
గనికల్లనిజముఁ దెలిసిన
మనుజుఁడెపో నీతిపరుఁడు ♦ మహిలోసుమతీ॥ 98

టీ॥ సుమతీ! మహిలోన్=భూమియందు, ఎవ్వరు=ఎట్టివారు, చెప్పినన్=చెప్పినప్పటికిని, వినన్=వినుట, తగున్=ఒప్పును, వినినంతనే=వినినతత్క్షణమే, వేగపడక=తొందరపడక, వివరింపన్=విచారణచేయుట, తగున్=ఒప్పును, కని=విచారణచేసి, కల్ల=అసత్యము, నిజమున్=సత్యమును, తెలిసినమనుజుఁడెపో=తెలిసికొనినమనుష్యుఁడేసుమా, నీతిపరుఁడు=న్యాయమునందాసక్తిగలవాఁడు.

తా॥ ఎంతమందేమిచెప్పినను చక్కగావినవలయును, వినఁగానె తొందరపడక విమర్శించి యిదినిజము, ఇదికల్ల యని తెలిసికొన్నవాఁడు నీతిపరుఁడనఁదగును.

క॥ వీడెముసేయనినోరును
జేడెలయధరామృతంబుఁ ♦ జెందనినోరుం
బాడంగరానినోరును
బూడిదకిరవైనపాడు ♦ బొందర సుమతీ॥ 99

టీ॥ సుమతీ ! వీడెము=తాంబూలము, చేయనినోరును=వేసికొననినోరును, చేడెల...మృతంబున్, చేడెల=యౌవనవతులైన స్త్రీలయొక్క, అధర=అధరోష్ఠమునందలి, అమృతంబున్=అమృతమును, చెందనినోరున్=పొందనినోరును, పాడంగన్=పాడుటకు, రానినోరును=శక్తిలేనినోరును, బూడిదకున్=బూడిదెకు, ఇరవు=స్థానము, ఐనపాడుబొందర=అయినట్టిపాడుగొంది సుమా.

తా॥ తాంబూలము వేసుకొనిన నోరును; యువతుల యధరామృతమును గ్రోలనినోరును, పాడనేరని నోరును బూడిద గుంటతో సమానము.

క॥ వెలయాలివలనఁగూరిమి
గలుగదు మఱి గలిగెనేని ♦ కడతేఱదుగా
పలువురు నడచెడుతెరువునఁ (నడచెడుమార్గం)
బురిమొలవదు మొలిచెనేని ♦ పొదలదుసుమతీ॥ 100
(బులపురిమొలవదు మొలిచిన)

టీ॥ సుమతీ ! వెలయాలివలనన్=భోగముదానివలన, కూరిమి=ప్రేమ, కలుగదు=కలుగనేకలుగదు, మఱి=ఒకవేళ, కలిగె

నేని=కలిగినప్పటికిని, కడతేఱదుగా=తుదనెగ్గదుగదా, పలువు ర=అనేకమంది, నడచెడి తెరువునన్=నడచునట్టిత్రోవలో, వు రి=గడ్డి, మొలవదు=మొలవనే మొలవదు, మొలచినేని=ఒకవేళ మొలచినప్పటికిని, పొదలదు=బ్రతుకదు.

తా॥ బాహాటముగా అనేకులు నడచునట్టి దారిలో గడ్డి మొలవనే మొలవదు, మొలచినను పెరిగివృద్ధిపొందదు. అదేవిధము గా వేశ్యాంగనకు ప్రేమస్నదేయుండదు. ఒకవేళ కారణాంతర ముచే వేశ్య ప్రేమించినను తుదనెగ్గింపదు.

క॥ వెలయాలు సేయుబాసలు
వెలయఁగ నగసాలపొందు ♦ వెలమచెలిమియుం
గలలోనఁగన్నకలిమియు
విలసితముగ నమ్మరాదు ♦ వినురా సుమతీ॥ 101

టీ॥ సుమతీ! వెలయాలు=వేశ్య, చేయుబాసలు=చేయునట్టి ప్రమాణములును, వెలయంగన్=ప్రసిద్ధముగా, అగసాలపొం దు=కంసాలివానిస్నేహమును, వెలమచెలిమియున్=వెలమవా నిస్నేహమును, కలలోనన్=స్వప్నమందు, కన్నకలిమియున్= అనుభవించినసంపదను, విలసితముగన్=నిజముగ, నమ్మరాదు= నమ్మవలదు, వినురా=వినుము.

తా॥ భోగముదిచేయు ప్రమాణములును, కంసాలివానితో స్నేహమును, వెలమకులమువానితో స్నేహమును, కలలోనను భవించిన సంపత్తును నమ్మఁదగినవికావు.

10

క॥ శుభముల నొందనిచదువును
సభినయముగ రాగరసము ♦ నందనిపాటల్
గుభగుభలులేని కూటమి
సభమెచ్చని మాటలెల్లఁ ♦ జప్పనసుమతీ॥ 102

టీ॥ సుమతీ! శుభములన్=మంగళములను, ఒందనిచదువును=పొందనివిద్యయు, అభినయముగన్=కాలుచేతులులోనగువానితోడియర్థసూచనగలుగునట్లుగా, రాగరసమున్=స్వరముల సారస్యమును, అందనిపాటల్=పొందనిసంగీతమును, సభ=సభ, మెచ్చనిమాటలు=మెచ్చుకొననిపలుకులు, ఎల్లన్=అన్నియును, గుభగుభలు=గుభగుభమనుధ్వనులు, లేనికూటమి=లేనట్టిపదుగుండ్రుకూడిక, చప్పన=రుచిలేనివి.

తా॥ లాభములేనివిద్యయును, అభినయమును మనోహరమైన రాగమునులేని పాటలును, సందడిగ నుత్సాహప్రసంగములులేని మేళనమును, సభలోనిజనులకు రుచింపని మాటలును రసహీనములు.

క॥ సరసము విరసముకొఱకే
పరిపూర్ణసుఖంబు లధిక ♦ బాధలకొఱకే
పెరుఁగుట విఱుగుటకొఱకే
ధరతగ్గుట హెచ్చుకొఱకె ♦ తథ్యము సుమతీ॥ 103

టీ॥ సుమతీ! సరసము=పరిహాసముగామాటాడుట, విరసముకొఱకే=రసభంగముకొఱకే—అనగా పరిహాసము క్రమముగ

తుత్రితిమించి విరోధముగా పరిణమించును ; పరిపూర్ణసుఖంబులు=సంపూర్ణముగానున్న భాగ్యములు, అధికబాధలకొఱకే=ఎక్కువకష్టములకొఱకే, పెరుఁగుట=అభివృద్ధినిఁబొందుట, విఱుగుటకొఱకే=చెఱువుకొఱకే, ధర=వెల, తగ్గుట=తక్కువయగుట, హెచ్చుకొఱకె=ఎక్కువగుటకొఱకే ; తథ్యము=నిజము.

తా॥ మొట్టమొదట పరిహాసముగా ప్రసంగించినవే క్రమముగ విరోధములుపుట్టించును ; పరిపూర్ణముగా సంపద యుండుట మిగుల కష్టములకే యగును ; ధర ఒకసమయమున తగ్గుట తరువాత నాయకమగుటకొరకే యగును ;

క॥ మేలెంచని మాలిన్యుని
మాలను నగసాలవాని ♦ మంగలి హితుగా
నేలిన నరపతిరాజ్యము
నేలఁగలిసి పోవుఁగాని ♦ నెగడనుసుమతీ॥ 104

టీ॥ సుమతీ! మేలు=ఉపకారమును, ఎంచనిమాలిన్యుని=తలపోయనిపాపుని, మాలను=మాలవానిని, అగసాలవాని=కంసాలిని, మంగలిన్=మంగలిని, హితుగాన్=ఇష్టమైనవానినిగా, ఏలిననరపతిరాజ్యము=పాలించినరాజుయొక్క ప్రభుత్వము, నేలన్=మట్టియందు, కలిసిపోవున్=కలసిచెడిపోవును, కాని=అంతేకాని, నెగడదు=అభివృద్ధిగానుండదు.

తా॥ ఇతరులు తనకు చేసినమేలును తలఁపనిపాపుఁడు, పంచముఁడు, కంసాలి, మంగలి వీరిని తనకు ఇష్టులైన వారినిగాఁ

జేసి భూమినేలిన రాజుయొక్క రాజ్యము నేలపాలగునుకాని యభివృద్ధిగా నుండదు.

క॥ స్త్రీలయెడ వాదులాడకు
బాలురతోఁ జెలిమిచేసి ♦ భాషింపకుమీ
మేలైన గుణము విడువకు
•మేలినపతి నిందసేయ ♦ కెన్నఁడుసుమతీ॥ 105

టీ॥ సుమతీ! స్త్రీలయెడన్=ఆఁడువాండ్రతో, వాదులాడక=సంవాదములుచేయకుము; బాలురతోన్=పిల్లలతో, చెలిమి=చనువును, చేసి=చేసికొని, భాషింపకుమీ=మాటలాడకుసుమా; మేలు=మంచిది, ఐన గుణము=అయినగుణమును, విడువకుము=విడిచిపెట్టకుము, ఏలినపతిన్=పాలించినప్రభువును, ఎన్నఁడున్=ఎప్పుడును, నిందసేయక=దూషింపకుము.

తా॥ స్త్రీలతో సంవాదముచేయుట చేటునకు మూలము; బాలురకు చనవిచ్చి మాటలాడరాదు; మంచిగుణములను విడువకూడదు; ప్రభుని నింద కూడదు.

క॥ సిరి తావచ్చినవచ్చును
సలలితముగ నారికేళ ♦ సలిలముభంగిన్
సిరి తాఁబోయినఁబోవును
కరిమ్రింగిన వెలఁగపండు ♦ కరణిసుమతీ॥ 106

టీ॥ సుమతీ! సిరి=సంపద, తాన్=తాను, స్వయముగ, వ

చ్చినఁ=కలిగినేని, నారికేళసలిలముభంగిఁ = కొబ్బరికాయ నీరువలె, సలలితము గన్=చక్కఁగా, వచ్చును=కలుగకమాన దు ; సిరి=సంపద, తాన్=తాను, పోయినన్=పోయె నేని, కరి= ఏనుఁగు, మ్రింగినవెలఁగపండుకరణిని=మ్రింగినట్టి వెలఁగపండు వలెనే, పోవును=చెడిపోవును.

తా॥ కొబ్బరికాయలో నెవఁడును బోయకుండనే నీరువచ్చిన ట్లు సంపదకూడ రానున్నప్పుడు కలుగకమానదు ; ఏనుఁగు మ్రింగిన వెలఁగపండులోని గుంజు వలె, సంపద పోఁదలచినప్పు డు స్వయముగా మాయమగును.

క॥ మదినొకని వలచియుండఁగ
మదిచెడి యొకకూరవిటుఁడు ♦ మానకతిరుగున్
బదిఁజిలుక పిల్లిపట్టినఁ
జదువునె యాపంజరమున ♦ జగతిని సుమతీ॥ 107

టీ॥ సుమతీ ! జగతిని=భూమియందు, మదిన్=మనసులో, ఒకనిన్=ఒకపురుషుని, వలచియుండఁగన్=ప్రేమించియుండఁగా, మది=బుద్ధి, చెడి=లేకపోయి, ఒకకూరవిటుఁడు=మఱియొక్క దుర్మార్గుఁడగు జారుఁడు, మానక=విడువక, తిరుగున్=దాని చుట్టుతిరుగును, పదిన్=చక్కఁగా, చిలుక=రామచిలుకను, పి ల్లి, పట్టినఁ=పట్టుకొనప్పుడు, ఆపంజరమునన్=ఆపంజరమందు, చదువునె=మాట్లాడునా ? ముద్దుమాటలు పలుకునా ?పలుకదు.

తా॥ పంజరములోని చిలుకను పిల్లిపట్టుకొనఁబోయినను చి

లుక పంజరములో నున్నందున స్వాధీనముకాదు; చిలుక 'అక్క' మొదలగు ముద్దుపలుకులుకూడ పలుకదు. అదేవిధము గా స్త్రీ తానొకపురుషుని కామించియుండఁగా మఱియొకవిటుఁ డెంతబలవంతపఱచినను లక్ష్యపెట్టక స్వాధీనముకాదు, మఱి యు వానిని ప్రేమించి మాటలాడదు.

క॥ పుత్రోత్సాహము తండ్రికిఁ
బుత్త్రుఁడు జన్మించినపుడె ♦ పుట్టదు జనులా
పుత్రుని గనుఁగొని పొగడఁగఁ
బుత్త్రోత్సాహంబు నాఁడు ♦ పొందురసుమతీ॥ 108

టీ॥ సుమతీ! తండ్రికిన్=తండ్రికి, పుత్త్రుఁడు=కుమారుఁడు, జన్మించినపుడె=పుట్టినతోడనే, పుత్రోత్సాహము=పుత్త్రుఁడు కలిగెనను సంతోషము, పుట్టదు=ఉండదు, జనులు=ప్రజలు, ఆపుత్రునిన్=ఆకుమారుని, కనుఁగొని=చూచి, పొగడగన్= కొనియాడఁగా, నాఁడు=అప్పుడు, లోకులుచేకొనియాడఁ బడు నంత గుణవంతుఁడైనప్పుడు, పుత్రోత్సాహంబున్=పుత్త్రుని యందుసంతోషమును, పొందుర=(తండ్రి) పొందునుసుమా.

తా॥ పుత్త్రుఁడుపుట్టి గుణవంతుఁడైనప్పుడే తండ్రి కుత్సా హముకలుగును కాని పుత్త్రసంతానమనఁగానే యుబ్బఁడు. అ నఁగా గుణహీనుఁడుపుట్టినను పుట్టనట్లేయగును.

క॥ వేసరపుజాతికానీ
వీసముఁ దాఁజేయనట్టి ♦ వ్యర్థుఁడుగానీ

దాసికొడుకైనఁగానీ
కాసులుగలవాఁడె రాజు ♦ గదరాసుమతీ॥ 109

టీ॥ సుమతీ ; వేసరపుజాతి=హీనజాతియందుఁబుట్టినవాఁడు, కానీ=అయినను, తాన్=తాను, వీసమున్=వీసమైనను, కొంచెమైనను, చేయనట్టివ్యర్థుఁడు=పనికిమాలినఅప్రయోజకుఁడు, కానీ=అయినను, దాసికొడుకు=దాసికిఁబుట్టినవాఁడు, ఐనంగానీ=అయినప్పటికి, కాసులు=ధనము, కలవాఁడె=ఉన్నవాఁడుమాత్రమే, రాజు=ప్రభువు, కదరా=కాదా ? అగును.

తా॥ ధనవంతుఁడు కులహీనుఁడైనను, గుణహీనుఁడైనను, దాసీపుత్రుఁడైనను లోకులు వానిని రాజుగా కొనియాడుదురు; అనఁగా నట్టివానినిగూడ అన్నిసుగుణములు కలవానినిగానే చెప్పుదురు.

స ం పూ ర్ణ ము.

Printed at Scape & Co., Cocanada:—1913.

ప్రకటన.

గయోపాఖ్యానము	చి॥ల॥	0	8	0
ప్రసన్నయాదవము	డిటో.	0	8	0
పారిజాతాపహరణము	డిటో.	0	8	0
పాండవజననము	తి॥వేం॥	0	9	0
పాండవవిజయము	డిటో.	0	12	0
పాండవప్రవాసము	డిటో.	0	12	0
పాండవాశ్వమేధము	డిటో.	0	12	0
పాండవోద్యోగము	డిటో.	0	10	0
విజయబొబ్బిలి	కో్ర॥సీ॥	0	12	0
పాండవాజ్ఞాతవాసము	డిటో.	0	8	0
హస్తినాపురము	డిటో.	0	8	0
పీష్వానారాయణరావువధ	డిటో.	0	8	0
జయంతజయపాల్	డిటో.	0	6	0
సుశీల	డిటో.	0	8	0
అభినవరాఘవము	డిటో.	0	8	0
ఉషాపరిణయము	డిటో.	0	8	0
చతురచంద్రహాస	డిటో.	0	8	0
శ్రీరామోద్యోగము	డిటో.	0	8	0
సీతాకల్యాణము	బ॥సీ॥	0	8	0

కర్రా అచ్చయ్య,

బుక్కు సెల్లరు,

రాజమండ్రి.